వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 225 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఫిబ్రవరి 2025 | వెల : రూ 10/-



## వరంగల్ వచ్చే ధైర్యం చేయని రాహుల్

- ప్రజలు నిలదీస్తారనే భయంతో పారిపోయారు
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు

హైదరాబాద్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ వచ్చే ధైర్యం లేక పారిపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జాగృతి మహిళా -మిగతా 3 లో



రిజర్వేషన్లపై ప్రభుత్వం మల్లగుల్లాలు

అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

మిగిలిన వారి కోసం మరోమారు కులగణన



## స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం

### న్యాయపరమైన చిక్కులు రాకుండా చర్యలు

హైదరాబాద్,

తెలంగాణలో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత కానరావడం లేదు. ఓ వైపు సమిక్షలు చేస్తుంటే..మరోవైపు మళ్లీ కులగణకు అవకాశం ఇవ్వండతో అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో ఆసల్యం తప్పదన్న భావన కూడా ఉంది. ఈనెల 15వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందని భావించారు. కానీ, స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మరోసారి -మిగతా 3 లో



## ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి

- మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయానికి ప్రారంభం

న్యూఢిల్లీ,

ఫ్రాన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల అధికారిక పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారంనాడు పలు కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. దక్షిణ మార్సెయిల్‌లోని మజార్గ్యూస్ యుద్ధ శ్మశానవాటికను సందర్శించి మొదటి, రెండవ ప్రపంచ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. -మిగతా 3 లో



## సోమరులను తయారు చేస్తున్న ఉచిత పథకాలు

- కష్టపడకుండానే డబ్బులు వస్తే..పనిచేస్తారా
- రాజకీయ పార్టీల ఉచిత హామిలపై సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ

ఉచిత పథకాలతో ప్రజల్లో కష్టపడే తత్వం పోతోందని, వారు పనులకు దూరంగా ఉంటున్నారని, రాజకీయ పార్టీల ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ఉచితాలను -మిగతా 3 లో



## సనాతనధర్మ పరిరక్షణ యాత్రలో పవన్ కళ్యాణ్

### కేరళలో అగస్త్యమహర్షి ఆలయ సందర్శన

కొచ్చి,

తిరుమల లడ్డూ వివాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.. తిరుమల లడ్డూ వివాదం దురదృష్టకరం అని అన్నారు. ప్రస్తుతం సనాతన ధర్మ యాత్రలో ఉన్న పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయాల నుంచి ఎవరూ డబ్బులు -మిగతా 3 లో

## శాస్త్రీయంగానే తెలంగాణ కులగణన

- సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం
- 16నుంచి 28 వరకు ఎన్యూమరేటర్లకు సమాచారాం ఇవ్వాలి
- 42శాతం బిసి రిజర్వేషన్ కోసం కేబినేట్ తీర్మానం
- చట్టబద్ధత కోసం కులగణన బిల్లు కేంద్రానికి పంపుతాం
- మీడియాకు వివరించిన డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ

తెలంగాణలో కులగణన సర్వే శాస్త్రీయంగా జరిగిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. వివిధ కారణాల వల్ల కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 16 నుంచి 28 వరకు సర్వే సిబ్బందికి వివరాలు అందజేయాలని సూచించారు. రాష్ట్ర జనాభా లెక్కల్లోకి వచ్చే విధంగా అందరూ చూసుకోవాలని కోరారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన -మిగతా 3 లో






## నోటాను కల్పిత అభ్యర్థిగా ప్రతిపాదించిన ఇసి

- తీవ్రంగా వ్యతిరేకించిన రాజకీయ పార్టీలు
- ఏకగ్రీవాల పేరుతో దందాలను అరికట్టాలన్న ఇసి
- రాజకీయ పార్టీలతో భేటీ కుదరని ఏకాభిప్రాయం

హైదరాబాద్,

స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను కల్పిత అభ్యర్థిగా పెట్టాలా వద్ద అనే అంశం రాజకీయ పార్టీల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అయింది. కాంగ్రెస్ పార్టీ ఈ పద్ధతిని వ్యతిరేకించగా బిఆర్ఎస్ పార్టీ స్వాగతించింది. బీజేపీ మాత్రం రాష్ట్ర ఎన్నికల సంఘంకి ఆ -మిగతా 3 లో

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమది ఒంటరి పోరాటమే




- బెంగాల్లో వరుసగా నాలుగోసారి విజయం సాధిస్తాం
- సీఎం మమతా బెనర్జీ ఆసక్తికర వ్యాఖ్యలు

కోల్‌కతాప్రజా స్వేచ్ఛ

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ ఒంటరి పోరాటంచేస్తుందని ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో 2026 ఏప్రిల్-మే నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో ప్రకటించారు. పార్టీ అధికార పత్రిక జాగో బంగ్లా ఈ విషయం వెల్లడించింది. తమకు ఎవరి మద్దతు అవసరం లేదని కూడా స్పష్టంచేసింది. ఇండియా బ్లాక్‌లోని కాంగ్రెస్, తదితర పార్టీలతో పొత్తు లేకుండా టీఎంసీ -మిగతా 3 లో

# మోడీ విమానాన్ని పేల్చేస్తామంటూ బెదిరింపులు

**-ఆరా తీస్తే ఓ పిచ్చోడి పనిగా గుర్తింపు**



**ముంబై, ప్రజా స్వేచ్ఛ**

విదేశీ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాణిస్తున్న విమానానికి ఉగ్ర బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. మోదీ విమానాన్ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రదాడి జరగొచ్చని తమకు సమాచారం వచ్చినట్లు ముంబయి పోలీసులు వెల్లడించారు.'ఫిబ్రవరి 11న ముంబయి పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఓ ఫోన్ కాల్ వచ్చింది. విదేశీ పర్యటనలో ఉన్న మోదీ విమానంపై ఉగ్రవాదులు దాడి జరగొచ్చు అని అవతలి వ్యక్తి బెదిరించారు. సమాచారంలో ఉన్న తీవ్రత దృష్ట్యా మేం వెంటనే ఇతర దర్యాప్తు సంస్థలను అప్రమత్తం చేశాం. కాల్ చేసిన వ్యక్తి ఎవరనే దానిపై దర్యాప్తు చేపట్టాం' అని ముంబయి పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు అనంతరం ఫోన్ కాల్ చేసిన వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని ప్రాథమికంగా తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ సోమవారం నాలుగు రోజుల విదేశీ పర్యటనకు బయల్దేరారు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో ఉన్న ఆయన కృత్రిమ మేధ కార్యాచరణ సదస్సులో పాల్గొన్నారు. పారిస్ పర్యటనను ముగించుకొని నేడు అమెరికా బయల్దేరనున్నారు. రెండు రోజుల పాటు అగ్రరాజ్యంలో పర్యటించనున్నారు. ఈసందర్భంగా అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కానున్నారు.

# గ్రూప్-2 పరీక్షల హాల్‌టిక్కెట్లు విడుదల




**అమరావతిప్రజా స్వేచ్ఛ**

ఈ నెల 23వ తేదీన జరగాల్సిన గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ హాల్ టికెట్లను బుధవారం విడుదల చేసింది. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపీపీఎస్సీ తెలిపింది. 23న ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు పరీక్ష జరగనుంది. కాగా.. పరీక్షా కేంద్రాలకు కేవలం హాల్ టికెట్ మాత్రమే తీసుకురావాలని, వేరే వస్తువులను ఏమీ తీసుకురావొద్దని ఏపీపీఎస్సీ సూచించింది.

# సచివాలయంలో పెచ్చులూడి కారు ధ్వంసం



**హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ**

సచివాలయంలోని ఐదో ఫ్లోర్ సౌత్ భాగంలోని పట్టీ కూలింది. దీంతో రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ వాహనం దెబ్బతింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడడం తో పెను ప్రమాదం తప్పింది. పట్టీ మొత్తం కూలే అవకాశం ఉండడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే సచివాలయంలో అక్కడక్కడ వాటర్ లీకేజీ అవుతుండడంతో గోడలు పెచ్చులూడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం సచివాలయ నిర్మాణానికి రూ.1200 కోట్ల ఖర్చు కాగా, ఈ నిర్మాణం నాసిరకం అంటూ అప్పట్లో కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సచివాలయం ప్రారంభం రోజే అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వం సచివాలయ నిర్మాణంపై విమర్శలు చేశారు.

## మాఘ పౌర్ణమితో కుంభమేళాలో పుణ్యస్నానాలు

**-లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు**

**ప్రయాగరాజ్,ప్రజా స్వేచ్ఛ**

మాఘ పూర్ణిమ సందర్భంగా మహా కుంభమేళాకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి దాదాపు కోటిమంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఇంకా లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. పౌర్ణమి ప్రత్యేకమైన రోజు కావడంతో లక్షలాదిగా తరలివచ్చారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యూపీ ప్రభుత్వం అప్రమత్తం అయింది. కట్టుదిట్టమైన భద్రత కల్పించింది. ఇంకోవైపు యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ స్వయంగా పరిస్థితుల్ని సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇటీవల జరిగిన దుర్ఘటనలు తిరిగి జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# ఆందోళనకారులపై రాక్షసత్వం

**-1400 మంది హత్యకు గురైనట్లు గుర్తింపు**
**-బంగ్లాలో షేక్ హసీనా జమానాపై ఐరాసా నివేదిక**



**న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ**

బంగ్లాదేశ్ అల్లర్లను అణివేసేందుకు ఆనాటి ప్రధాని షేక్ హసీనా క్రూరంగా వ్యవహరించిందని, ఆందోళనకారులను హత్యలు చేయించదని, అప్పటి ప్రభుత్వంపై ఐక్యరాజ్యసమితి సంచలన వ్యాఖ్యలు చేసింది. అధికారం చేజారకూడదనే ఉద్దేశంతో నిరసనకారులను హత్య చేసిననట్లు, దాడులు జరిపినట్లు పేర్కొంది. అవి మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాలని అభివర్ణించింది. ఐరాస స్పందనను అంతర్జాతీయ మీడియా కథనాలు ప్రచురించాయి. 2024లో జులై, ఆగస్టు నెలల్లో జరిగిన ఘటనలకు సంబంధించిన విచారణ ఆధారంగా ఈ వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నాయి. ఆ సమయంలో సుమారు 1400 మంది ఆందోళనకారులు చనిపోయినట్లు వెల్లడించాయి. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆందోళనలు తీవ్రంగా ఉండటంతో ఆమె దేశం విడిచి, భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. ఆమె రాజీనామాతో బంగ్లాలో అవామీ లీగ్ ప్రభుత్వం పడిపోయింది. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం కొనసాగుతోంది. ప్రస్తుతం హసీనాపై పలు కేసులు నమోదయ్యాయి. బంగ్లాదేశ్‌కు చెందిన అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ గతంలో అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆమెతోపాటు పలువురు మాజీ క్యాబినెట్ మంత్రులు, సలహాదారులు, మిలటరీ అధికారులపైనా అరెస్టు వారెంట్‌లు జారీ అయ్యాయి. అలాగే ఆమెను స్వదేశానికి రప్పించేందుకు బంగ్లా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

# బిసిలను అణచాలని చూస్తే ఊరుకోం

**-బిసి లెక్కలన్నీ తప్పుల తడకలే**
**-మేధోమధన సదస్సులో తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు**



**హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ**

ఎవరైనా బీసీ జాతుల గొంతు మీద కాలు పెడతామని అంటే ఊరుకోం బిడ్డా.. మీ అంతు చూస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు చేశారు. బంజారాహిల్స్ కళింగభవన్‌లో తెలంగాణ ప్రభుత్వ కులగణన సర్వే రిజర్వేషన్ల పూర్వాపరాలు, సమస్యలు, ఆందోళనకర అంశాలు, పరిష్కార మార్గాలు అంశంపై బుధవారం మేధోమధన సదస్సు నిర్వహించారు. -పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ అల్ ఇండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, తెలంగాణ బ్యాక్ వర్డ్ క్లాస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు తీన్మార్ మల్లన్న హాజరై ప్రసంగించారు. మనం ఇప్పటి వరకు కులగణనలోని లోపాలను సమాజం ముందు పెట్టినం.. ప్రభుత్వం చేసిన బీసీ లెక్కలు తప్పు అనడానికి అనేక విధాలుగా ప్రజల ముందు ఉంచామన్నారు. ప్రభుత్వం బీసీ లెక్కల తప్పిదాలను ఎప్పుడు సరిచేస్తదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల ఆర్థిక పరమైన లెక్కలు కూడా బయటికి రావాలని.. 2 లక్షల 91 వేల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు సగం రావాల్సిందేనన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి కూడా బీసీలపై జరిగిన ఆర్థిక దోపిడి అంశాన్ని చర్చకు తీసుకోవాలని.. బీసీలకు జరిగిన అన్యాయన్ని అన్ని రంగాల్లో లెక్కలు తీస్కొని ప్రజలకు వివరించాలని కోరారు. బీసీలకు సీట్లు పార్టీలు వేసే బిచ్చమ్ అని.. అదే రిజర్వేషన్స్ మాత్రం రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలనే గెలిపించాలి.. ఆ దిశగా మనం ప్రణాళిక రచించాలి.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైండ్ బ్లాక్ అయ్యే రిజల్ట్ ఉండాలని బీసీలకు మల్లన్న పిలుపునిచ్చారు. బీసీల కోసం గొంతెత్తి నాకు పార్టీ నోటీసులు ఇస్తే.. ఈ సభ నాకు మద్దతుగా నిలిచిందని ధన్యవాదాలు తెలిపారు. బీసీ రిజర్వేషన్స్ సాధించడమే మా అందరి అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పుడున్నది గత తెలంగాణ కాదు.. ఎడ్డి తెలంగాణ కాదు.. చైతన్యం ఉన్న తెలంగాణ.. బీసీలు చైత్యంతో ఉన్నారని అన్నారు. జిల్లా, గ్రామీణ ప్రాంతంలో బీసీలు చర్చ పెట్టాలని.. తీన్మార్ మల్లన్న టీంలో ఆధ్వర్యంలో కొన్ని గ్రామాల్లో జనాభా లెక్కలు తీస్తామని.. ఆ లెక్కలను గ్రామ పంచాయతీ దగ్గర అతికిస్తామని పేర్కొన్నారు.

# అయోధ్య ప్రధాన పూజారి కన్నుమూత

**-ఆచార్య సత్యేంద్ర కుమార్ దాస్ మృతి చెందినట్లు ధృవీకరణ**



**అయోధ్య,ప్రజా స్వేచ్ఛ**

అయోధ్యలోని శ్రీ రామ జన్మభూమి ఆలయ ప్రధాన పూజారి, అయోధ్య ధామ్ ఆచార్య సత్యేంద్ర కుమార్ దాస్ మహారాజ్ బుధవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. 83 ఏళ్ల వయసున్న పూజారి.. ఫిబ్రవరి 3న బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి లక్నో సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో చేరారు. తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతున్న ... ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు డాక్టర్లు ప్రకటించారు. ఆచార్య సత్యేంద్ర దాస్ ఈ నెల ప్రారంభంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆయనను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి సంతాపం తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేసిన సమయంలోనూ రామమందిరానికి పూజారిగా ఉన్నారు. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సమయంలోనూ సత్యేంద్రదాస్ కీలక పాత్ర వహించారు. అయోధ్య రామాలయం ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ 20 ఏళ్ల వయస్సులోనే ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నారు. సత్యేంద్ర దాస్ 34 సంవత్సరాలుగా శ్రీరామ జన్మభూమిలో ప్రధాన పూజారిగా పనిచే స్తున్నారు. ఆయన 1945 మే 20న ఉత్తరప్రదేశ్‌లోని సంత్ కబీర్ నగర్ జిల్లాలో జన్మించారు. సత్యేంద్ర దాస్ తన గురువు అభిరామ్ దాస్ జీ ప్రభావంతో 1958లో అంటే 13 ఏళ్ల వయస్సులో సన్యాసం స్వీకరించారు. అప్పటి నుంచీ ఆయన తన ఇంటిని వదిలి ఆశ్రమంలో నివసించారు. నిర్వాణి అఖాడకు చెందిన దాస్, అయోధ్యలో అందుబాటులో ఉండే సాధువులలో ఒకరు. అయోధ్యతో పాటు, రామాలయంలో జరుగుతున్న పరిణామాలపై... దేశవ్యాప్తంగా అనేక మంది మీడియా వ్యక్తులకు అందుబాటులో ఉండే వారు. రామమందిర ఉద్యమం, ముందుకు సాగే మార్గంపై మీడియా అడిగిన అన్ని ప్రశ్నలకు దాస్ చాలా ఓపికగా సమాధానాలిచ్చేవారు. కూల్చివేత తర్వాత కూడా, దాస్ ప్రధాన పూజారిగా కొనసాగారు. రామ్ లల్లా విగ్రహానికి తాత్కాలికంగా ప్రతిష్టించినప్పుడు పూజలు చేశారు.

# గాంధీ ఆస్పత్రికి రోడ్డు ప్రమాద మృతుల బాడీలు

**హైదరాబాద్,**

ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళా నుంచి తిరిగొస్తుండగా మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు యాత్రికులు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలను రెండు అంబులెన్సుల్లో జబల్‌పుర్ నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పోలీసులు, డీఎంహెచ్‌వో, రెవెన్యూ అధికారుల సమక్షంలో మృతదేహాలను కుటుంబ సభ్యులకు




అప్పగించారు. మల్లారెడ్డి, సంతోష్, శశికాంత్, రవి, రాజు మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి నాచారం నుంచి వచ్చిన వారి కుటుంబసభ్యులకు అప్పగించగా.. బ్యాంక్ మేనేజర్ టీవీ ప్రసాద్ మృతదేహాన్ని తార్నాకలోని గోకుల్‌నగర్‌లో ఉండే ఆయన కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

www.prajaswecha.com
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

# స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం

(మొదటి తరువాయి)

కులగణన సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 నుంచి 28 వరకు అవకాశం కల్పించింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని స్పష్టం చేసింది. దీంతో రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందాకే ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్మాత్మకంగా నిర్వహించిన సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. 96.9శాతం అంటే3.50 కోట్ల మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారు. 3.1శాతం అంటే 16లక్షల మంది వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదు. అయితే ఈ లెక్కల ఆధారంగానే పంచాయతీ ఎన్నికలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలను వెంట వెంటనే నిర్వహించనుందని సమాచారం. ఎన్నికలకు సన్నద్ధతపై ఇటు ప్రభుత్వం, అటు ఎన్నికల కమిషన్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాను సైతం ఈసీ ఇటీవలే ప్రకటించింది. ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్స్ పెట్టే అవకాశం ఉంది. తాజాగా బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పంచాయతీ ఎన్నికలపై సీఎస్ శాంతి కుమారి, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై క్లారిటీ వచ్చిన వెంటనే షెడ్యూల్ రిలీజయ్యే అవకాశం ఉంది. 42శాతం సీట్లు ఇవ్వడానికి సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో పాత పద్ధతినే అమలు చేస్తారని తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు యాభైశాతం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అంతకన్నా ఎక్కువ సీట్లు కేటాయించాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఉభయ సభలను సమావేశపర్చి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ తరుణంలో అది సాధ్యం కాదని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఒక అడుగు ముందుకు వేసింది. తమ పార్టీ 42శాతం సీట్లను బీసీలకు కేటాయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ ఇటీవలే రైతు భరోసా మొత్తాన్ని కర్షకుల ఖాతాల్లో జమ చేసింది. బీసీ కులగణన చేపట్టి 56 శాతం వెనుకబడిన వర్గాల వారున్నారని తేల్చింది. వారికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకులున్న దృష్ట్యా పార్టీగా ప్రకటిస్తామని వివరించింది. ముందుగా పార్టీ గుర్తుతో సంబంధం లేకుండా జరిగే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఏక గ్రీవాలు అధికంగా చేయడం ద్వారా మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకోవాలని భావించింది. ఈసీ నోటా అంశాన్ని తెరమీదకు తేవడంతో కొంత ఇబ్బంది పడ్డ కాంగ్రెస్.. ఇవాళ నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ లో ఒకే అభ్యర్థి బరిలో ఉంటే నోటాతో పోటీ పెట్టే అంశాన్ని వ్యతిరేకించింది. గెలిచిన సర్పంచులు.. అభివృద్ధి కోసం తమ పార్టీలో చేరుతారని భావిస్తోంది. వారిని చేర్చుకొని వాళ్ల అండతో ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమయ్యే అవకాశ ఉంది. ఇలా చేయడం ద్వారా మెజార్టీ మండలాల్లో పాగా వేయొచ్చన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం బీసీలకు కొంచం తక్కువ 23 శాతం సీట్లను కేటాయించనుంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీలకు 28శాతం స్థానాలను కేటాయించే అవకాశం ఉందని సమాచారం. దీనిపై న్యాయ సమీక్ష జరిగిన తర్వాత ఎలాంటి ఆటంకాలు రావని నిర్ధారించుకున్న మీదటే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది.

# శాస్త్రీయంగానే తెలంగాణ కులగణన

(మొదటి తరువాయి)

మాట్లాడుతూ... 'బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై మార్చి మొదటి వారంలో కేబినెట్ తీర్మానం చేయనుంది. శాసనసభలో బిల్లు ఆమోదం చేసి చట్టబద్ధం చేయాలని నిర్ణయించాం. కులగణన బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో ఆమోదానికి కృషి చేస్తాం. ఓబీసీల రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీల నాయకులను కలుస్తాం. దశాబ్దాల ఓబీసీల కలలను నిజం చేసేందుకు కృషి చేస్తాం. రిజర్వేషన్లపై రాజకీయపరంగా కుట్రలు చేస్తే తిప్పి కొడతాం. రాజకీయ లబ్ది పక్కన పెట్టి మద్దతు పలకాలని కోరుతున్నాం' అని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే సహేతుకంగా, స్పష్టంగా చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే పై అసెంబ్లీలో లెక్కలతో సహా సీఎం సభ దృష్టికి తెచ్చారని, అసెంబ్లీలో చర్చ సందర్భంగా అనేక రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సలహాలు సూచనలు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే సహేతుకంగా, స్పష్టంగా చేశామని ఆయన పేర్కొన్నారు. 3.1శాతం మంది మాత్రమే ఇంటి యజమానులు సర్వేలో పాల్గొనలేదన్నారు. కొద్దిమంది ఇంటికి తాళాలు వేసి వెళ్లారని ఆయన తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటి వాళ్ళు ఉద్దేశపూర్వకంగా సర్వేకు రాలేదని, సర్వేలో పాల్గొని వారి కోసం మరోసారి కుటుంబ సర్వేకు ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మరో అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. టోల్ ఫ్రీ ద్వారా కూడా సమాచారాన్ని ఇస్తే ఎన్యుమరేటర్లు వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని భట్టి విక్రమార్క తెలిపారు. మండల కేంద్రాల్లో రాష్ట్ర జనాభా లెక్కల్లోకి రావాలని అందర్ని కోరుతున్నామన్నారు. అంతేకాకుండా.. 'లెక్కలోకి వచ్చి జన జీవన స్రవంతిలో కలవాలని కేసీఆర్ లాంటి వాళ్ళను కోరుతున్నాను. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు వివరాల నమోదు పూర్తి చేసి? లెక్కలన్నీ క్యాబినెట్ లో పెట్టి బీసీలకీ 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. మార్చి మొదటి వారంలో క్యాబినెట్ లో పెట్టి తర్వాత అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్ చేస్తాం. .ఈ బిల్లును కేంద్రానికి పంపి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తాం. పార్లమెంటు లో కూడా ఈ బిల్ పెట్టి ఆమోదించేలా రాహుల్ గాంధీని, ప్రధానిని, అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి వారి మద్దతు కూడా గడతాం. దశాబ్దాల బిసిల కల నెరవేర్చుతాం. కలసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను తీసుకుని ఢిల్లీ వెళతాం. స్థానిక సంస్థల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేస్తాం. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం మేం చేసే కార్యక్రమానికి మద్దతు పలకాలని కోరుతున్నాం. ప్రగతిశీల భావజాలలు ఉన్న అందరు కలిసి రావాలి.' అని భట్టి విక్రమార్క అన్నారు.

# నోటాను కల్పిత అభ్యర్థిగా ప్రతిపాదించిన ఇసి

(మొదటి తరువాయి)

అధికారం లేదని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పింది. సిపిఎం నోటా ఉండాలని.. కానీ అభ్యర్థిగా గుర్తించోద్దని స్పష్టం చేసింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ లతో రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీ అయింది. ట్రయల్ ప్రాతిపదికన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నోటా ను కూడా ఒక కల్పిత అభ్యర్థిగా పెట్టాల వద్దా అనే అంశం రాజకీయ పార్టీ ల అభిప్రాయం తీసుకుంది. రాజకీయ పార్టీ ల ముందు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతిపాదనలు పెట్టింది. ఎన్నికల ఫలితాలను ప్రకటించేటప్పుడు నోటాను 'కల్పిత ఎన్నికల అభ్యర్థి'గా పరిగణించడం, పోటీ చేస్తున్న అభ్యర్థి , 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా అత్యధిక సంఖ్యలో సమాన ఓట్లను పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించడం. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ వ్యక్తిగతంగా 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా కంటే తక్కువ ఓట్లు పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఎవరూ ఎన్నికైనట్లు ప్రకటించబడరు. ఎవరు ఎన్నిక కానట్లు అయితే, ఆ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహించబడుతుంది. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కారు? తిరిగి ఎన్నికలో, నోటాకు మళ్లీ అత్యధిక ఓట్లు వస్తే, తదుపరి ఎన్నికలు నిర్వహించబడవు, అత్యధిక ఓట్లు ఉన్న పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించబడుతుంది. ఈ ప్రతిపాదనలు పై రాజకీయ పార్టీ లు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చాయి. కాంగ్రెస్ పార్టీ కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని వ్యతిరేకించింది? నోటా ఎక్కువ ఓట్లు వచ్చి ఎన్నికలు మళ్ళీ నిర్వహించాలని అంటే అటు ప్రభుత్వానికి, ఇటు అభ్యర్థులకు ఖర్చు పెరుగుతుందని ఆ పార్టీ నేతలు అన్నారు. ఏకగ్రీవానికి బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందనీ ఆ పార్టీ పేర్కొంది. సుప్రీంకోర్టు లో కేసు ఉందని మా అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని బీజేపీ అంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం లేదనీ పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వం అని స్పష్టం చేసింది. నోటా తో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పింది. నోట ఉండాలని అయితే అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తె రీ ఎలక్షన్ కరెక్ట్ కాదనీ సిపిఎం చెప్పింది?.తమ అభిప్రాయాన్ని రెండు రోజుల్లో చెప్తామని టిటీడీపీ చెప్పగా సింగల్ కాండిడేట్ ఉన్నా నోటా ఉండాలన్న జనసేన పార్టీ.. చెప్పింది. రాష్ట్రంలో సర్పంచ్ పదవుల వేలంను అరికట్టడానికి కల్పిత అభ్యర్థి నిర్ణయం అని రాష్ట్ర ఎన్నికల సంఘం అంటుంది. ఇప్పటికే మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలు కల్పిత అభ్యర్థి విధానం ను అవలంభిస్తున్నాయని ఎన్నికల సంఘం రాజకీయ పార్టీ ల ముందు పెట్టింది.

## సనాతనధర్మ పరిరక్షణ
# యాత్రలో పవన్ కళ్యాణ్

(మొదటి తరువాయి)



ఆశించకూడదని.. కానీ అలా జరగకపోవడం బాధాకరమని అన్నారు. ఘటనకు బాధ్యులైన నిందితులు అరెస్టయ్యారని అన్నారు. తిరుమల కల్తీ నెయ్యి కేసులో ఇటీవల సీబీఐ నలుగురిని అరెస్ట్ చేసిన క్రమంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సనాతన ధర్మ యాత్రలో భాగంగా బుధవారం కేరళ, తమిళనాడులోని వివిధ పవిత్ర స్థలాలకు పవన్ కళ్యాణ్ తీర్థయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా తమిళనాడులోని పవిత్ర స్థలాలకు ఆధ్యాత్మిక యాత్రకు బయలుదేరారు. కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన తన ప్రయాణంలో శ్రీ అగస్త్య మహర్షి ఆలయాన్ని దర్శించుకొని.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పవన్ కళ్యాణ్ కేరళ పర్యటనకు వెళ్లారు. సనాతనధర్మ పరిరక్షణలో భాగంగా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ఆలయాలను పవన్ సందర్శించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఆయన కేరళలోని కొచ్చి సమీపంలో ఉన్న అగస్త్య మహర్షి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పవన్ కళ్యాణ్ వెంట ఆయన కుమారుడు అకీరానందన్, తితిదే బోర్డు సభ్యుడు ఆనంద్‌సాయి ఉన్నారు. బుధవారం సాయంత్రం తిరువనంతపురంలోని పరశురామ స్వామి ఆలయాన్ని పవన్ సందర్శించనున్నారు. మూడు రోజుల పర్యటనలో అనంత పద్మనాభస్వామి, మధుర మీనాక్షి, అగస్త్య జీవసమాధి, కుంభేశ్వర, స్వామిమలైయ్, తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు పవన్ వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు కేరళ, తమిళనాడులోని పలు పుణ్య క్షేత్రాలను పవన్ కళ్యాణ్ దర్శించుకోనున్నారు. పవన్ కళ్యాణ్ నడుము నొప్పి బాధపడుతుండడంతో రాష్ట్రం సచివాలయంలో మంత్రులు, ముఖ్య కార్యదర్శులతో సిఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమావేశానికి ఆయన రాలేదు. మంత్రి నాదెండ్ల మనోహర్ కలుగ జేసుకొని పవన్ రెండు వారాలుగా తీవ్రమైన నడుము నొప్పితో బాధపడుతున్నారని, అందుకే సమావేశానికి రాలేదని చెప్పారు. రెండు మూడు రోజుల్లో విధులకు హాజరవుతారని వివరణ ఇచ్చారు. వెంటనే చంద్రబాబు స్పందించారు. పవన్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించానని, కానీ దొరకలేదని, ఇప్పుడెలా ఉన్నారని బాబు అడిగారు. కాస్త పర్వాలేదని మనోహర్ జవాబిచ్చారు.

## వరంగల్ వచ్చే ధైర్యం
# చేయని రాహుల్

(మొదటి తరువాయి)

విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలపై నిలదీస్తారనే భయంతో రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు. వరంగల్ లో రాహుల్ గాంధీ ఇచ్చిన రైతు డిక్లరేషన్ అమలే కాలేదని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరుకోబోరని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మకం లేక ఎన్నికలప్పుడు ఢిల్లీ నుంచి నాయకులను తీసుకొచ్చారని విమర్శించారు. సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ వచ్చి చిలుక పలుకులు పలికారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖం కాదు. సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీల ముఖం చూసి మహిళలు కొంత వరకు ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా మహిళలకు 2500 ఇవ్వడం లేదు . రేవంత్ రెడ్డి మహిళలకు రూ .35 వేల చొప్పున బాకీ పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20 శాతం పెరిగిందని అన్నారు. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని, శివారు ప్రాంతాల్లోని ఇళ్లలో దొంగలు చెలరేగుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క మతకల్లోలం జరగలేదని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకా ఎక్కడో ఒక చోట తరుచూ మతకల్లోలాలు జరుగుతున్నాయి,రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో 70 శాతం పనిచేయడం లేదని ఆరోపించారు.

భద్రత కోసం కూడా మహిళలు పోరాటం చేయాల్సిరావడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ పై అక్కసుతో కేసీఆర్ కిట్ లను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తుందని కవిత
దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ ఆస్పత్రులపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చి బస్సుల సంఖ్యను తగ్గించారని, బీడీ కార్మికులకు పెన్షన్ ను 4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి

(మొదటి తరువాయి)

ప్రధాని వెంట ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కూడా హాజరయ్యారు. మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయాన్ని కూడా మోదీ, మాక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. కాంటినెంటల్ ఫ్రాన్స్‌లో తొలి భారత రాయబార కార్యాలయం ప్రారంభించడం ద్వారా ఇరుదేశాల మధ్య మరింత లోతైన సంబంధాలు ఏర్పడటంతో పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలు, మల్టీ డైమన్షయల్ రిలేషన్‌షిప్‌కు బలం చేకూరిందని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. దీనికి ముందు పారిస్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌లో మాక్రాన్‌తో కలిసి సదస్సుకు మోద అధ్యక్షత వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం ప్రధాని అమెరికా పర్యటనకు బయలుదేరుతున్నారు. రెండో దఫా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఆదేశంలో మోదీ పర్యటించనుండటం ఇదే ప్రథమం.

## సోమరులను తయారు చేస్తున్న
# ఉచిత పథకాలు

(మొదటి తరువాయి)

వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఉచితాలపై ఈ వ్యాఖ్యలు చేసింది. 'ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్ట వశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలి. ఉచితాల ద్వారా అలా జరుగుతోందా..?ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదు' అని జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన మిషన్‌ను పూర్తి చేసే పనిలో ఉందని.. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించేందుకు యోచిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈసందర్భంగా ధర్మాసనానికి తెలిపారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ఈ నిర్మూలన మిషన్ ఎంతకాలం పాటు పని చేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌ను మరో ఆరు వారాల తర్వాత విచారిస్తామని వాయిదా వేసింది.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమది ఒంటరి పోరాటమే

(మొదటి తరువాయి)

ఒక్కటే మూడింట రెండు వంతుల మెజారిటీతో గెలిచి బెంగాల్‌లో వరుసగా నాలుగోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని మమత ధీమా ప్రకటించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు వేర్వేరుగా పోటీచేయడం వల్ల ఓట్లు చీలి భాజపా గెలవడంతో అందరికీ భయం పట్టుకున్నందునే తృణమూల్ ఇలాంటి అనవసర వ్యాఖ్యలు చేస్తోందని పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది. మరోవైపు ఢిల్లీలో ఉచితాలు పంచినా ఆప్ ఓడిపోయినట్లే బెంగాల్‌లో కూడా టీఎంసీ పరాజయం పాలవుతుందని రాష్ట్ర భాజపా నాయకులు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ వెన్నుపోటు వల్లే ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓడిపోయిందని, ప్రతిపక్ష ఇండియా కూటమిలో కొనసాగే హక్కు కాంగ్రెస్‌కు లేదని టీఎంసీ లోక్ సభ సభ్యుడు కీర్తి ఆజాద్ ఢిల్లీలో విమర్శించారు. కాంగ్రెస్ మునిగిపోతున్న పడవ అయినా అది మిత్రపక్షాలను వెన్నుపోటు పొడుస్తూనే ఉందని వ్యాఖ్యానించారు. భాజపా ఇతర పార్టీలతో కలసి రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందనే వాస్తవాన్ని కాంగ్రెస్ గ్రహించడం లేదన్నారు. కాంగ్రెస్‌కు దురహంకారం ఎక్కువని, ఇండియా కూటమికి మమతా బెనర్జీయే నాయకత్వం వహించాలని ఆజాద్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## కులాల కుంపట్లో చలికాచుకుంటున్న రాజకీయ పార్టీలు !

ఏరోజుకు ఏది అవసరమో అది మాట్లాడడం..ఆయా వర్గాలను ఆకట్టుకునేలా చెప్పడం రాజకీయ పార్టీలకు షరా మామూలు అయ్యింది. దేశంలో బడుగు,బలహీన వర్గాలతో పాటు, నిమ్న వర్గాలను దువ్వడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయి. తాజాగా ఇప్పుడు ఎస్సీవర్గీకరణ, బిసి కులగణన వ్యవహారం నడుస్తోంది. ఈ రెండు వర్గాలను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీలు జెండాలెత్తుకున్నాయి. తామే వారికి రక్షణ కవచమని, వారి అభ్యున్నతే తమ రాజకీయం అని చెబుతున్నాయి. తెలంగాణలో బిసి కులగణన సరిగా జరగలేదని బిజెపి, బిఆర్ఎస్ వాదిస్తున్నాయి. పక్కా ప్రణాళికతో చేపట్టామని కాంగ్రెస్ చెబుతోంది. ఎవరు కరెక్ట్..ఎవరు రాంగ్ అన్నది ఆయా వర్గాల ప్రజలు విశ్లేషించుకుంటున్నారు. నిజానికి ఏ పార్టీ కూడా ఈ కులాలకు పెద్దపీట వేయడంలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడుగా దళితుడైన మల్లికార్జున ఖర్గే ఎన్నికైనా అది పేరుకు మాత్రమే. పెత్తనం, వ్యవహారమంతా రాహుల్, సోనియా, ప్రియాంకల గుప్పిట్లో ఉంది. అదో కుటుంబ పార్టీగా మారింది. బిఆర్ఎస్‌లో అయితే పక్కా కుటుంబ పార్టీయే. టిడిపి కూడా మరీ కుటుంబ పార్టీ అనక తప్పదు. వీరంతా ఇప్పుడు కులాల ఉద్దరణకు వీరతాళ్లు వేసుకున్నారు. బిసిలపై కాంగ్రెస్‌కు ప్రేమలేదని, వారిని మోసం చేశారని తెలంగాణలో బిజెపి, బిఆర్ఎస్‌లు అంటున్నాయి. అందుకే ఇప్పుడు బిజెపి కూడా బిసి అధ్యక్షుడిని చేస్తుందన్న ప్రచారం ఉంది. కాంగ్రెస్ ఇప్పటికే బిసిని అధ్యక్షుడిగా చేసేసింది.బిఆర్ఎస్‌లో ఆ ఛాన్స్ లేదు. అక్కడ వెలమదొరలు తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. టిడిపిలో చంద్రబాబు కుటుంబం తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. ఇలా పార్టీల్లోనే న్యాయంచేయలేని వారు ఎస్సీ, బిసిలకు న్యాయం చేస్తామంటే నమ్మడం ఎలా అన్నదే సమస్య. దేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సమాఖ్యలు అన్నీ అగ్రవర్ణాల నాయకత్వంలోనే నడుస్తున్నాయి. కమ్యూనిస్టుల్లో కూడా అగ్రకులాలదే పెత్తనం అని వేరుగా చెప్పనక్కరలేదు. తమ గుప్పిట్లో అధికారం ఉండాలి...కానీ తము మాత్రం కింది కులాల వారికి అండగా ఉన్నామని చెప్పుకోవాలన్న తలబిరుసుతనంతో ఆయా పార్టీల నేతలు ఉన్నారు. అందుకే పార్టీ నాయకత్వ మైనా, అధికార పెద్దరికమైనా చేజారిపోకుండా జాగ్రత్త పడుతూనే ఉంటారు. ఇప్పటికీ తక్కువ కులాల్లో జాతి వివక్ష కొనసాగుతోంది. దీనిని తొలగించి వారిని సమాజాంలో అందరితో సమానంగా చేయడానికి ప్రయత్నాలు సాగడం లేదు. అంతెందుకు కులవ్యవస్థ నిర్మూలనకు ఎవ్వరూ పోరాడడం లేదు. కులాల పేరు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు అలవాటు పడ్డ వీరు కలుఆలను సజీవంగా కొనసాగించేలా చేస్తున్నారు. బడుగువర్గాల, శ్రమజీవుల ప్రతినిధులమని చెప్పుకొనే పార్టీల్లో కూడా ఈ జాడ్యం కొనసాగడం దారుణం. మరోవైపు అగ్రకుల అధిపత్యానికి విరుద్ధంగా..పాలనలో తమ వాటా, భాగస్వామ్యం కోసం దేశం లోని బిసిలు, దళితులు గట్టిగా పోరాడలేక పోతున్నాయి. కాన్షీరామ్ బిఎస్‌పి స్థాపించి సంచలనం సృష్టించినా, అధికార యావలో ఆ పార్టీ కొట్టుకుపోయింది. అంతెందుకు తెలంగాణలో దళిత ఉద్దరణ అంటూ బయలుదేరి బిఎస్పిలో చేరిన ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా అధికార యావలో బిఆర్ఎస్‌లో చేరారు. బిఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పిన ఆయన చివరకు అదేపార్టీ చంకనెక్కారు. అంటే ఏదో ఒక డబ్బున్న పార్టీలో చేరితే తప్ప మనుగడ లేదని ఆయన గుర్తించివుంటారు. నిజానికి బిసిలు సమగ్ర కులగణన కోరుతున్నారు. మాదిగలు ఎస్‌సి రిజర్వేషన్లలో తమ వాటా తేల్చమంటున్నారు. తాజాగా ఎబిసిడి వర్గీకరణ జరగాలని మందకృష్ణమాదిగ కోరుతున్నారు. వీరి డిమాండ్లు క్రమంగా రాజకీయ ప్రాధాన్యతను పొందాయి. గత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు వీటి ప్రస్తావన తేక తప్పలేదు. తాజాగా ఇప్పుడు పంచాయితీ ఎన్నికలు రావడంతో అన్నిరాజకీయ పార్టీలు బిసిలకు తామే ప్రతినిధులం అన్నట్లుగా బయలుదేరాయి. తొమ్మిదన్నరేళ్లు అన్ని వర్గాలను అణగదొక్కి, తెలంగాణ పేరు చెప్పి దోచకున్న బిఆర్ఎస్ నేతలుకూడా బిసిలపట్ల ఎక్కడ లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో గెలిపిస్తే దేశంలో బిసిల కులగణన చేపడతామని రాహుల్ గాంధీ చెబుతూ వచ్చారు. ఎస్‌సి రిజర్వేషన్లలో మాదిగలకు న్యాయం చేస్తామని భరోసా ఇస్తూ ప్రధాని మోడీ ఎన్నికల ప్రచార వేదికపై మందకృష్ణ మాదిగ కన్నీళు తుడిచారు. నిజం ఏమిటంటే ఈ రెండు సమస్యలు రాజకీయ క్షేత్రంలో పావులుగా వాడుకోవడానికి అన్ని పార్టీలకు ఉపయోగపడుతున్నాయి. ఏ ప్రధాన రాజకీయ పార్టీకి వీరి డిమాండ్ల పట్ల చిత్తశుద్ధి లేదనడంలో సందేహం లేదు. తమ రాజకీయ నిచ్చెనను ఎక్కడానికి వీరు మెట్లుగా ఉపయోగపడతారు కాబట్టి వారి గురించి మాట్లాడుతున్నారు. వారి సమస్యలను అధ్యయనం చేసి, వారి ఆకాంక్షలను నెరవేర్చి ఆయా వర్గాల అభ్యున్నతికి పాటుపడాలన్న ఆసక్తి ఏ రాజకీయపార్టీకి లేదనే చెప్పాలి. పైగా వారిని ఎదగకుండా చేసి, ఉన్నచోటనే ఉంచి అవసరానుగుణంగా వాడుకోవాలన్న రాజకీయ దురుద్దేశం కూడా ఆయా పార్టీ నేతలకుంది. దేశంలోని బిసిలు, మాదిగలు కోరుకుంటున్న విధంగా విధాన కల్పన చేయాలనీ ఏ ప్రభుత్వానికి లేదు. కింది కులాలు ఎదిగి తమ పీఠాలు కదిలించకుండా సకల జాగ్రత్తలు ఆ నాయకులు తీసుకుంటారు. నిజానికి దేశం అభివృద్ధిలో పయనించాలంటే పేద, ధనిక వర్గాలను గుర్తించి వారికి పథకాలు అందచేయాలి. దళిత,బిసి వర్గాలను గుర్తించి వారి ఆర్థిక స్థోమత ఆధారంగా పతకాలు రచించాలి. విద్య,ఉద్యోగ రంగాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయంగా వారిని భాగస్వాముల ను చేయాలి. కులనిర్మూలన చేసి భారతజాతిని ఏకంచేయాలి. అలాచేసే ధైర్మం ఉందా అన్నది చెప్పాలి. కులాల కుంపట్లు రాజేసి రాజకీయ లబ్ది పొందే రాజకీయ స్వార్థ పరుల పట్ల ఆయా కులాల వారు జాగ్రత్తగా ఉండడం ఎప్పటికీ అసరం.

# మోదీని కాంగ్రెస్ అడ్డుకోగలదా?

'రాజుకు ఒకటే నిబంధన వర్తిస్తుంది. అతడు బలంగా ఉండాలి, విస్తరిస్తూనే ఉండాలి' అని చాణక్యుడు చెప్పినట్లుగా మౌర్య సామ్రాజ్యం దేశమంతటా విస్తరించినట్లే భారతీయ జనతా పార్టీ కూడా నరేంద్రమోదీ సారథ్యంలో దేశమంతటా విస్తరించేందుకు దండ యాత్రలు చేస్తున్నట్లు కనపడుతోంది. ఏడాది ఏడాదికీ ఆయన సారథ్యంలో ప్రతిపక్ష రాష్ట్రాల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. రెండేళ్ల క్రితం రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ బీజేపీ కైవశం కాగా క్రమంగా ఒడిషా, ఆంధ్రప్రదేశ్, హరియాణాతో పాటు ఇటీవలి కాలంలో దేశ రాజధాని ఢిల్లీ కూడా బీజేపీ లేదా బీజేపీ మిత్రపక్షాల పాలనలోకి వచ్చాయి. ప్రస్తుతం 15 రాష్ట్రాలు బీజేపీ పట్టులోకి పూర్తిగా రాగా మొత్తం 21 రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నది. మోదీ బలగాలు పశ్చిమ బెంగాల్, తెలంగాణతో పాటు సాధ్యమైనన్ని రాష్ట్రాల్లో చొచ్చుకువచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి.నిజానికి ఢిల్లీలో బీజేపీ పూర్వరూపమైన జనసంఘ్‌ను బలోపేతం చేయడంలో అటల్ బిహారీ వాజపేయి, లాల్‌కృష్ణ ఆడ్వాణీ కీలక పాత్ర పోషించారు. 1957లో ఎంపీగా ఉన్న అటల్ బిహారీ వాజపేయికి సహాయపడేందుకు ఢిల్లీ వచ్చిన లాల్‌కృష్ణ ఆడ్వాణీ ఢిల్లీలో జనసంఘ్ బాధ్యత కూడా చేపట్టారు. 1958లో తొలిసారి ఏర్పడిన ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు ఆయన తీవ్ర కృషి చేశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, జనసంఘ్ తన తొలి సంకీర్ణ రాజకీయాలు ఢిల్లీలో కమ్యూనిస్టులతో ప్రారంభించింది. మేయర్, ఉపమేయర్ పదవులను రొటేషన్ ప్రకారం పంచుకునేందుకు జనసంఘ్, సీపీఐల మధ్య ఒప్పందం కుదరడమే అందుకు నిదర్శనం. 1970వ దశకంలో కార్పొరేషన్ ఎన్నికల్లో జనసంఘ్‌ను గెలిపించేందుకు వాజపేయి, ఆడ్వాణీతో పాటు వందలాది జనసంఘ్ కార్యకర్తలు రాత్రింబగళు కృషిచేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా జనసంఘ్ విజయం సాధించలేదు. ఫలితాలు వెలువడిన రోజు సాయంత్రం 'ఛలో కోయీ సినిమా దేఖ్ నే చల్తీ హై' అని అటల్, ఆడ్వాణీ పహాడ్ గంజ్‌లోని ఇంపీరియల్ సినిమా థియేటర్‌కు వెళ్లి ఒక హిందీ సినిమా చూశారు. ఆ సినిమా పేరు 'ఫిర్ సుబా హోగీ' (మళ్లీ ఉదయం వస్తుంది)! ఒకప్పుడు ఢిల్లీ సింహంగా పేరొందిన మదన్‌లాల్ ఖురానా. ఆడ్వాణీ మాదిరే పాకిస్థాన్ నుంచి కట్టుబట్టలతో వచ్చినవాడే.



విజయ్‌కుమార్ మల్హోత్రా, కేదార్‌నాథ్ సహానీ లాంటి నేతలతో కలిసి ఢిల్లీలో జనసంఘ్ విభాగాన్ని స్థాపించిన ఖురానా తర్వాతి కాలంలో బీజేపీని కూడా బలోపేతం చేశారు. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 47.82 శాతం ఓట్లతో 49 సీట్లు సాధించి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. ఆ తర్వాత బీజేపీ అంతర్గత కలహాలతో కూరుకుపోయింది. అప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి రాలేకపోయింది.ఢిల్లీలో 27 ఏళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ సామ దానభేద దండోపాయాలను ప్రయోగించింది. గత పదేళ్లుగా మోదీ, షాలు ఎంత ప్రయత్నించినా కేజ్రీవాల్‌ను ఢీకొనలేకపోయారు. కాని ఈ సారి ఢిలీలో అధికారంలోకి వచ్చేందుకు మోదీ, షాలు చేయని ప్రయత్నమంటూ లేదు. అన్ని రకాల ఎన్నికల వ్యూహాల్ని అవలంబించడమే కాదు, కేజ్రీవాల్‌ను ప్రజల దృష్టిలో దిగజార్చేందుకు బీజేపీ తీవ్రప్రయత్నాలు చేసింది. అతడి అవినీతి కార్యకలాపాలను బయటపెట్టి అతడు నిజాయితీపరుడన్న భ్రమలు తొలిగేలా చేసి అధికారంలోకి రాగలిగింది. నిజానికి ఢిల్లీలో బీజేపీకి చెప్పుకోదగ్గ నాయకుడు లేనేలేడు.

బీజేపీ మోదీ పేరుతోనే ఎన్నికల్లో గెలిచింది. మోదీ హయాంలో బీజేపీ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఎవరు అవుతారన్న దానికి ప్రాధాన్యం లేకుండా పోయింది. కేజ్రీవాల్ లాంటి బలమైన నేతలు కూడా మోదీని ఢీకొనలేకపోవడం దేశ రాజకీయాల్లో కీలక పరిణామం. స్పష్టంగా చెప్పాలంటే కేజ్రీవాల్ తనకు తిరుగులేదన్న అహంతో ఎన్నో వ్యూహాత్మక తప్పిదాలకు పాల్పడ్డారు. తనపై మారుతున్న ప్రజాభిప్రాయాన్ని పసిగట్టలేకపోయారు. 'ఒక మద్యం సీసా బాటిల్ కొంటే మరో మద్యం సీసా ఉచితంగా ఇచ్చి మా సంసారాన్ని నాశనం చేశాడు సార్' అని ఒక పనిమనిషి చెప్పింది. మద్యం కుంభకోణమే అన్ని అవినీతి కార్యకలాపాలకన్నా కేజ్రీవాల్ ప్రతిష్ఠను బాగా దెబ్బతీసింది. ఈ కుంభకోణంలో తనను అరెస్టు చేసినప్పుడు జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ లా రాజీనామా చేయకుండా జైలుకు వెళ్లి కూడా ముఖ్యమంత్రిగా కొనసాగడంతో కేజ్రీవాల్‌పై సానుభూతి అన్నది లేకుండా పోయింది. జైలు నుంచి రాగానే తనను తాను మళ్లీ ముఖ్యమంత్రి పదవికి అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. ఆయన జైలులో ఉన్నప్పుడు కేజ్రీవాల్ భార్య ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని సందేశాలివ్వడం, ముఖ్యమంత్రి అయిన అతిషీ ఆ కుర్చీలో కూర్చోకుండా మితిమీరిన భక్తి ప్రదర్శించడం తప్పుడు సంకేతాలు ఇచ్చింది. అంతే కాదు, పార్టీకోసం పనిచేసిన వారిని విస్మరించి దాదాపు 30 స్థానాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే కేజ్రీవాల్ సీట్లు ఇచ్చారు. మనీష్ సిసోడియా లాంటి వ్యక్తికి సీటు మార్చి అతడి ఓటమికి కారణమయ్యారు. రాజ్యసభ సీట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారన్న అపఖ్యాతి మూటగట్టుకున్నారు. అభివృద్ధి జన జీవనాలను మెరుగుపరచడంపై కాకుండా ఉచితాలను అధికంగా నమ్ముకున్నారు. ఉచిత విద్యుత్, ఉచిత నీరు, మహిళలకు ఉచిత బస్‌పాస్‌లు గెలిపిస్తాయనుకున్నారు. యమునలో మురికినీరు ప్రవహిస్తున్నా, రహదారులు దెబ్బతిన్నా, వాయుకాలుష్యం పెరిగిపోతున్నా, రహదారులు, కాలనీల్లో ఆక్రమణలు పెరిగిపోతున్నా పట్టించుకోలేదు. స్వంత కాళ్ల క్రింద నేల కరిగిపోతున్నా గ్రహించకుండా ఇతర రాష్ట్రాల్లో విస్తరించి జాతీయ నాయకుడుగా ఎదగాలన్న తహతహను ప్రదర్శించారు.

# ఉన్మాద పోకడలు

'సర్వేజనా సుఖినోభవంతు..'అని చెబుతుంటారు. అన్ని మతాలు సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించేవే! అయితే మతం పేరు చెబుతూనే పరమత విశ్వాసులపైన, సెక్యులర్ భావాలు కలిగిన వారిపైన తమ మనోభావాలు దెబ్బతింటున్నాయన్న పేరుతో మతోన్మాదుల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోవడం ఆందోళనకరం. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన పుస్తక ప్రదర్శనలపై దాడులు, చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడి నివాసానికి వెళ్లి ఆయనపై దాడి చేయడం, బెదిరించడం వంటి పరిణామాలు విద్వేష శక్తుల వీరంగానికి నిదర్శనాలు. గతంలో గోవింద్ పన్సారే, గౌరీ లంకేష్ వంటి హేతువాదులను హత్యచేసిన మతోన్మాద మూకల దుశ్చర్యలు గుర్తుకొస్తున్నాయి.

సంఘ్ పరివార్ కుదుళ్ల నుంచి వచ్చిన సంస్థలు%ా% కొందరు వ్యక్తులు.. మూకదాడులు చేయడం ఉత్తరాదిలో తరచూ కనిపిస్తూ ఉంటుంది. ఈ దుష్ట సంస్కృతిని తెలుగు రాష్ట్రాల్లోనూ విస్తరింపజేసే యత్నాలే ఇటీవలి ఘటనలు. వంద ఆలోచనలు సంఘర్షించనీ.. వెయ్యి భావాలు వికసించనీ%ా% అన్నది లోకోక్తి. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడు తనకు నచ్చిన మతాన్ని అనుసరించడానికి, అన్ని మతాలకు చెందిన వారు జీవించడానికి, వారి భావజాలాన్ని ప్రచారం చేసుకోవ డానికి, అందులో భాగంగా పుస్తకాలను ప్రచురించడానికి, విక్రయించు కోవడానికి హక్కు ఉంది. అయితే అవి ప్రజాజీవనానికి విఘాతం కలిగించరాదు. హైదరాబాద్‌లో బుక్ ఫెస్టివల్ నిర్వహిస్తుండగా వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్‌పై కొందరు దాడికి తెగబడ్డారు. 'సనాతన ధర్మం'పైనా, తిరుపతి బాలాజీ ఆలయంపై పుస్తకాలను విక్రయించొద్దంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. తిరుపతిలో 'పెరియార్ జీవిత చరిత్ర' పుస్తకాన్ని అమ్మవద్దంటూ దాడికి పాల్పడ్డారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాసిన ద్రౌపది పుస్తకాన్ని అమ్మరాదని గొడవ చేశారు. ప్రముఖ సంస్కర్త త్రిపురనేని



రామస్వామి చౌదరి సాహిత్యాన్ని కూడా తూలనాడారు. నెల్లూరు తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఘటనలు జరిగాయి. వీటిపై మేధావులు, సాహితీవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సమయంలోనే%ా% హైదరాబాద్ సమీపంలోని ప్రసిద్ధ ఆలయం చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సిఎస్ రంగరాజన్‌పై దాడి జరిగింది. 'రామరాజ్యం' పేరుతో సంస్థను స్థాపించిన వీరరాఘవరెడ్డి సుమారు ఇరవై మందిని తీసుకెళ్లి, కస్టడీలోకి తీసుకుంటున్నా మంటూ%ా% ఆయన్ను ఒక చిన్నగదిలో చుట్టుముట్టి పిడిగుద్దులు గుద్దారు. తమ సైన్యంలోకి యువతను రిక్రూట్ చేయాలని, ఆర్థిక వనరులను సమకూర్చాలని దారుణాలకు పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు. అరాచక మూక న్యాయస్థానాలను సైతం కించపరిచింది. ఇటీవల వీహెచ్‌పీ వారు గన్నవరం సమీపంలో జరిపిన భారీ సభలో డిమాండ్ చేసిన మాదిరిగానే రంగరాజన్, ఆయన తండ్రి ఆలయ వ్యవస్థాపకుడు సౌందర రాజన్ ఆలయాలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండకూడదు, ధార్మిక సంస్థలు నడపాలంటూ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. చిలుకూరు దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకూ కృషి చేశారు. అయినా మతోన్మాదులు దుశ్చర్యకు పాల్పడ్డారు.

మెజారిటీ వాదం పేరుతో మత ఉన్మాదాన్ని పెంచి పోషించే దుశ్చర్యల ఫలితమే ఇది. పుస్తకాలను, సినిమాలను అడ్డుకోవడం, ట్రోల్ చేయడం, రచయితలను, కవులను, మేధావులను కించపరచడంలాంటి దుశ్చర్యలకు తెగబడుతున్నా మీనమేషాలు లెక్కించడం, ప్రత్యక్షంగానో, పరోక్షంగానే సహకరించడం బీజేపీ, దాని మిత్రులు అధికారంలో వున్నచోట పరిపాటిగా మారిపోయింది. అటువంటి పరిస్థితి వల్ల అరాచక మూకలు పెచ్చరిల్లుతున్నాయి. రాజ్యాంగంలోని భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించే ఏ చర్య అయినా దుర్మార్గమే! దాన్ని కూకటి వేళ్లతో పెకలించాల్సిందే. తాజా ఘటనను ప్రగతిశీల శక్తులతోపాటు సనాతనవాదిగా మారిన పవన్ కల్యాణ్ సైతం ఖండించారు. ఆయుధాలు పట్టి ఆర్మీలను నడుపుతున్న ఈ అరాచకవాదులను, గోగూండాలను కేంద్రప్రభుత్వం అడ్డుకోకపోగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అండదండలిస్తోంది? ప్రగతికాములు, లౌకిక ప్రియులు, శాంతి, సామరస్యాలను కోరుకునే వారందరూ ఒక్క గొంతుతో నిరసించాలి. ప్రజాస్వామ్య, అభ్యుదయ సాహిత్యానికి, భావాలకు నెలవైన తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి మతోన్మాద దుశ్చర్యలకు చోటులేదని బిగ్గరగా చాటిచెప్పాలి!

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసిన మూడవత్ రవీందర్





ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి రాజాపేట, ఫిబ్రవరి 12

రాజాపేట మండల కేంద్రంలోని బాలురు,బాలికల ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు బుధవారం పుట్టగూడెం గ్రామానికి చెందిన మూడవత్ రవీందర్ పరీక్ష ప్యాడ్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, వెంకటేష్,శ్రీకాంత్,కార్తీక్, నరేష్,వినోద్, శ్రీనివాస్, ప్రవీణ్, తరుణ్, రామ్ కుమార్ లింగ పాల్గొన్నారు.

# మర్లావ గ్రామంలో అగ్ని ప్రమాదం



కాకినాడ జిల్లా, పెద్దాపురం. ఫిబ్రవరి 12: ప్రజా స్వేచ్ఛ

పెద్దాపురం మండలం,మార్లావ గ్రామంలో తాటాకు ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాధంలో సుమారు రూ. 2 లక్షలు ఆస్తినష్టం వాటిల్లగా కుటుంబీకులు సురక్షతంగా బయటపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం బండి చక్కరవేణి కోన సత్యకాంతం ఒక తాటాకింట్లో రెండు గదుల్లో కాపురం చేస్తున్నారు.వంట గ్యాస్ లీకేజ్ అవడంతో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి చూస్తుండగానే ఇల్లు దగ్ధం అయింది. స్థానికులు అప్రమత్తమై చుట్టుపక్కల మంటలను ఆర్పడంలోనూ, ఇంటివద్ద ఉన్న పశువులను, కుటుంబీకులను బయట తీసుకురాగా వారు స్వల్పకాయలతో బయటపడ్డారు.రూ. 1.50 లక్షలు నగదు, బంగారు ఆభరణాలు,ఫ్రిడ్జ్,టీవీ, గ్రైండర్,వంటి విలువైన సామాగ్రీ దగ్ధమైంది. విషయం తెలిసి పెద్దాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చెయ్యడంలో సేవాలాందించారు.రెవెన్యూ సిబ్బంది ఆస్తి నష్టంపై అంచనాలు తయారు చేశారు.

# కాంగ్రెస్ పార్టీకి అధిక స్థానాలు ఖాయం

## కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు బట్టే సంతోష్ కుమార్



ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి రామన్నపేట ఫిబ్రవరి 12

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు సాధిస్తుందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టే సంతోష్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజాపాలనపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలను అపోహాలను ప్రజలు నమ్మొద్దని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 14 మాసాలలో పేద ప్రజల సంక్షేమం కొరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ,200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్,రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు ప్రస్తుతం రైతులకు రైతు భరోసా ఎకరాకు 6000 చొప్పున పంపిణీ చేశారు అని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పరిపాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు ఒక్క ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు భూమి లేని పేద కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందజేయడానికి అర్హులైన వారి జాబితా రూపొందించి లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేపడుతుంటే ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వారి మాటలు నమ్మవద్దు అని అన్నారు.

# సీఎం చేతిలో సహకార భవిష్యత్






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

- రాజకీయ సమీకరణ కోసం చైర్మెన్ల పదవీ కాలాన్ని పొడిగించే ఛాన్స్
- రేపటితో ముగియనున్న పీఏసీఎస్, డీసీసీబీల పదవీ కాలం
- రాష్ట్రంలో 909 పీఏసీఎస్‌లు..9 డీసీసీబీలు..
- పదవీకాలం పొడిగించాలని మంత్రి తుమ్మలను కలిసిన చైర్మెన్లు ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు చైర్మెన్లు
- ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి చర్యలు : డీసీఓ

ప్రజా స్వేచ్ఛ మెదక్ ప్రాంతీయ

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థల భవితవ్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతిలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా పీఎసీఎస్, డీసీసీబీ చైర్మెన్లు, వైస్ చైర్మెన్ల పదవీ కాలం ఈ నెల 14తో ముగియనుంది. ఇప్పటికిప్పుడు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేనందున పదవీ కాలాన్ని పొడిగించాలని ప్రస్తుత చైర్మెన్లు రాష్ట్ర సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని మంత్రి చైర్మెన్లకు హామీ ఇచ్చారు. రాజకీయ సమీకరణాల రీత్యా పాత వాళ్లకే తిరిగి కొంత సమయం ఇవ్వడం ద్వారా సహకార సంఘాల్లో పూర్తి స్థాయిలో అధికార పార్టీ పట్టు బిగించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు స్పెషలాఫీసర్లున్నారు. దాంతో ప్రభుత్వం సహకార సంఘాలకు స్పెషలాఫీసర్లను పెట్టాలా..? పాత వాళ్ల పదవీ కాలాన్ని పొడిగించాలా..? అనే విషయంలో మల్లగుల్లాలు పడుతుంది.

2020 ఫిబ్రవరి 16న రాష్ట్రంలో ఉన్న 909 ప్రాథమిక సహకార సంఘాలు, 9 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులతో పాటు జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థలకు ఎన్నికలు జరిగాయి. అదే నెలలోనే చైర్మెన్, వైస్ చైర్మెన్, ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. ఐదేండ్ల పదవీ ఈ నెల 14వ తేదితో ముగియనుంది. దాంతో రాష్ట్రంలో ఉన్న పీఏసీఎస్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మెన్, వైస్ చైర్మెన్లంతా మాజీలు కానున్నారు. ఈ నేపథ్యంలో తమ పదవీకాలాన్ని పొడిగించాలని పలువురు డీసీసీబీ చైర్మెన్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కొందరు డీసీసీబీ చైర్మెన్లు రాష్ట్ర సహకార శాఖ తుమ్మల నాగేశ్వరరావును మంగళవారం కలిశారు. సహకార సంఘాలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేనందున తమకే కొంత కాలం అవకాశం ఇవ్వాలని కోరినట్టు చెబుతున్నారు. రబీ వ్యవసాయ సీజన్‌తో పాటు ఖరీఫ్ ముందస్తు ప్రణాళికలు ఏప్రిల్ నెలలో చేయాల్సి ఉన్నందున సహకార సంఘాలకు పాలక వర్గాలు ఉండాలని సూచించినట్టు తెలుస్తోంది.

విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, ఇతర రుణాలు, రబీ ధాన్యం కొనుగోలు వంటి ముఖ్యమైన రైతు సేవా సహకార కార్యక్రమాలు సహకార సంఘాల ద్వారా జరుగుతున్నందున చైర్మెన్ల పదవీ కాలం పొడిగించడం వల్ల ప్రభుత్వానికి రైతుల నుంచి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవని మంత్రి దృష్టికి తెచ్చినట్టు చెబుతున్నారు. చైర్మెన్లు చెప్పిన పలు విషయాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, చైర్మెన్ల పదవీ కాలం పొడగింపు విషయం గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చైర్మెన్లకు హామీ ఇచ్చినట్టు సమాచారం.

**రాజకీయ సమీకరణను బట్టి నిర్ణయం**

రాష్ట్రంలో సహకార సంఘాల్లో అత్యధిక మంది చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. పదేండ్ల పాటు అధికార పార్టీలో ఉన్నందున ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో పట్టు బిగించారు. రాష్ట్రంలోని సహకార సంఘాల్లో 65 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే రైతు సంక్షేమ పథకాలు డీసీసీబీలు, పీఎసీఎస్‌ల ద్వారా అమలయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున కొందరు డీసీసీబీ చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు ఆ పార్టీలో చేరారు. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్‌రెడ్డితో పాటు పలు డీసీసీబీ చైర్మెన్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మిగతావారూ కాంగ్రెస్ వైపు వచ్చేలా పదవీ కాలాన్ని పొడగించాలని కాంగ్రెస్‌లోని చైర్మెన్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇప్పుడు సహకార పీఎసీఎస్, డీసీసీబీలకు కూడా స్పెషలాఫీసర్లను పెట్టడం సాధ్యమేనా అనేది పరిశీలిస్తున్నారు.

**కొత్త సహకార సంఘాలెప్పుడో..**

నూతన సహకార విధానం ప్రకారం దేశంలోని ప్రతి గ్రామంలో ఒక్కో ప్రాథమిక సహకార సంఘం, మత్స్య, పాత ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేయాలని 2022లో కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. రాష్ట్రంలో 272 మండలాల్లో ఒకే ఒక సహకార సంఘముంది. 81 మండల కేంద్రాల్లో ఒక్క సంఘమూ లేదు. 2013 తర్వాత రాష్ట్రంలో కొత్త సహకార సంఘాలేర్పడలేదు. 500 పైగా కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా సంఘాల్ని ఏర్పాటు చేయాలా..? పాత సంఘాల్ని విభజించాలా..? అనే విషయాలపై రిపోర్టు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల ఇటీవల జరిగిన సమావేశంలో అధికారుల్ని ఆదేశించారు. ఇంతలో పదవీ కాలం ముగిసినందున కొత్త సంఘాల ఏర్పాటు ఇప్పట్లో లేనట్టేనని రైతులు అంటున్నారు.

ప్రభుత్వ నిర్ణయం బట్టి ఉంటుంది : రేపల్లె కిరణ్‌కుమార్, జిల్లా సహకార అధికారి

సహకార సంఘాల పదవీ కాలం ముగియనున్నందున రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బట్టి అమలు చేస్తాం. చైర్మెన్ల పదవీ కాలం పొడగించాలని మంత్రి తుమ్మలను కలిసి కోరారు. ప్రభుత్వం ఎన్నికలకు వెళు_ందా..? ప్రత్యేక అధికారుల్ని నియమిస్తుందా..? పదవీ కాలం పొడగిస్తారా..? అనేది గురువారం సాయంత్రం వరకు ప్రభుత్వం ప్రకటించే అవకాశముంది.

# మూడెకరాలలోపు రైతులకు గుడ్ న్యూస్.. అకౌంట్లలో డబ్బులు జమ..!!




ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్

తెలంగాణలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మూడు ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతు భరోసా నిధులు జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. జనవరి 26న ఈ రైతు భరోసా పథకం కింద ప్రభుత్వ నిధుల జమను ప్రారంభించింది. ఫిబ్రవరి 5న 17.03 లక్షల మందికి, ఫిబ్రవరి 10న 8.65 లక్షల మందికి విడతల వారీగా నిధులు జమ చేసినట్లు ప్రకటించింది. కాగా ఇప్పటివరకు 2 ఎకరాల లోపు ఉన్న 34 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2200 కోట్లు జమ చేసింది. మొత్తంగా 37 లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయం నగదును జమ చేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# మంత్రి కొండా సురేఖ మరో బాంబ్..





## త్వరలోనే ఈటలపై విచారణ!

ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్

మంత్రి కొండా సురేఖ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై త్వరలోనే విచారణ జరుపుతామని తెలిపారు. గత 10 ఏళ్లలో తెలంగాణలో దేవాదాయ శాఖ భూములు కబ్జాలకు గురయ్యాయని కొండా సురేఖ తెలిపారు. ఇదే సమయంలో తెలంగాణలో చేపట్టిన కులగణన సర్వే మళ్లీ నిర్వహించాలని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కొండా సురేఖ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ మంత్రుల్లో సంచలన వ్యాఖ్యలకు తెరదీసే రాష్ట్ర దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈటల రాజేందర్ భూ కబ్జాలపై తొందరలోనే విచారణ ప్రారంభిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలోని దేవాదాయ శాఖ భూములు కబ్జాకు గురి అయ్యాయని మంత్రి తెలిపారు. అందులో గత ప్రభుత్వంలో ఉన్న నేతలు ఎక్కువ మంది ఉన్నట్లు తమకు సమాచారం ఉందని కొండా సురేఖ వెల్లడించారు. ఇక ప్రస్తుతం మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్‌పై త్వరలో విచారణ జరుగుతుందని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్‌పై భూ కబ్జా ఆరోపణలు రావడంతో ఆయన ఎమ్మెల్యే పదవికి, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బీజేపీలో చేరి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. మరోవైపు.. రాష్ట్రంలో కులగణన నిర్వహించి.. బీసీ రిజర్వేషన్ల సర్వేతో కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని బీఆర్ఎస్ పార్టీ తమను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోందని మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆరోపణలు చేశారు. కులగణన విలువ ఇప్పుడే అర్థం కాదని చెప్పారు. ఉద్యోగాలు, ఇతర అంశాల్లో బీసీలకు తీవ్ర న్యాయం జరుగుతుందని కొండా సురేఖ ఈ సందర్భంగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### కేటీఆర్‌పై కొండా సురేఖ విమర్శలు

కులగణన సర్వే అంతా తప్పుల తడకగా ఉందని.. రీ సర్వే చేయాలంటూ రేవంత్ రెడ్డి సర్కార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేయగా.. ఆ వ్యాఖ్యలకు మంత్రి కొండా సురేఖ స్పందించారు. సర్వే మళ్లీ నిర్వహించాలంటే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని కొండా సురేఖ స్పష్టం చేశారు. రీ సర్వే అని కేటీఆర్ అంటున్నారని.. అయితే ఆయన తన చెల్లి కల్వకుంట్ల కవితను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ఈ కులగణన సర్వేలో గానీ, ప్రొఫార్మాలో గానీ ఎక్కడ తప్పులు జరిగాయో చెప్పాలని ఈ సందర్భంగా కేటీఆర్‌ను కొండా సురేఖ డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరతపై స్పందించిన కొండా సురేఖ.. ఉద్యోగులు తక్కువగా ఉండటం వల్ల పాలనా పరంగా కొంత ఇబ్బంది అవుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ శాఖ నుంచి ఉద్యోగులను తీసుకోవడం ఇప్పుడు కొత్తేమీ కాదని తేల్చి చెప్పారు. దేవాదాయ శాఖలో ఉన్న భూములు.. లీగల్ లిటికేషన్స్ లేని వాటిని మొదటి దశలో సర్వే చేయాలని దేశించామని ఆమె వివరించారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ కుంభాబిషేకాలు చేయాలో నివేదిక ఇవ్వాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కాళేశ్వరంలో కుంభాభిషేకం చేసి 42 ఏళ్లు అవుతుందని గుర్తు చేశారు. ఫారెస్ట్‌లో సర్వేయర్ల రక్షణ గురించి ఎలాంటి ఫిర్యాదులు లేవని తెలిపారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి రాజాపేట,ఫిబ్రవరి 12

యాదగిరిగుట్టకు అతి చెరువలో ఉన్న వెంకటాపురం శ్రీ లక్ష్మీనరసింహస్వామీ వారి ఆలయ ప్రాంగణంలో బుధవారం (పౌర్ణమి) సందర్భంగా హరే రామ హరే కృష్ణ భక్తబృందం ఆధ్వర్యంలో పూణే నుండి వచ్చిన చిలివేరు లక్ష్మి - చక్రపాణి దంపతులు కుటుంబ సమేతంగా 6వ, శ్రీమద్ భగవద్గీత జ్ఞాన మహా యజ్ఞాన్ని నిర్వహించారు. ముందుగా గణపతి పూజ,పుణ్యహవచనం నవగ్రహ పూజ, లక్ష్మీ నరసింహ స్వామి పూజ నిర్వహించి తర్వాత శ్రీమద్ భగవద్గీత లోని 18 అధ్యాయాలలోని ప్రతి శ్లోకానికి ఓం నమో భగవతే వాసుదేవాయ స్వాహా అని మంత్రాన్ని పఠిస్తూ జ్ఞాన మహా యజ్ఞాన్ని నిర్వహించి పూర్ణాహుతితో ముగించారు. హరే రామ హరే కృష్ణ భక్త బృందం చేస్తున్న కార్యక్రమాలను గమనించి, అన్నదానాలు






చేయుటకు అవసరమగు వంట పాత్రలను పండిత్ చిలువేరు చక్రపాణి బహుకరించారు. ఈ కార్యక్రమంలో హరే రామ హరే కృష్ణ భక్తబృందం అధ్యక్షులు చెడదీపు సత్యనారాయణ, కార్యదర్శి బోగ నిర్మల, బృంద సభ్యులు సిద్దు, ఇంద్రా రెడ్డి, బాలరాజు, నాగరాజు, రామచంద్రం, కావ్య, కవిత, భారతమ్మ, ఉమ, మాజీ సర్పంచ్ భోగ ఋషి, మాజీ ఎంపీటీసీ భోగ హరినాథ్, పురోహితులు చెడదీపు కృష్ణ, విష్ణు, పాండురంగ%శీ%, బంధుమిత్రులు, భక్తులు పాల్గొన్నారు.

## భరత్‌నగర్ శ్రీ హరిహర క్షేత్ర ఆలయంలో వైభవంగా శివ మహా పడిపూజ

### కోహిర్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో శివ మహా పడిపూజ



కూకట్ పల్లి, ప్రజా స్వేచ్ఛ

పరమేశ్వరుని కృప కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని శ్రీ హరి హర క్షేత్ర దేవస్థానం పాలకమండలి చైర్మన్ డాక్టర్ పి.నాగిరెడ్డి అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని భరత్ నగర్ శ్రీహరి హర క్షేత్ర ఆలయ ప్రాంగణంలో కోహిర్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శివ మహా పడిపూజ కార్యక్రమంలో నాగిరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, కష్టనష్టాలను తట్టుకొని ప్రతి ఒక్కరు వారి జీవితంలో ఉన్నతంగా రాణించాలని వారందరికీ పరమేశ్వరుని అనుగ్రహం సిద్ధించాలని ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, జగదీష్,సంజీవరెడ్డి, రమేష్,వికే రావు,నాగరాజు, వేణు,రమేష్,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకల వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

### -ఎలుసరి కృషయ్య రాష్ట్ర అధ్యక్షులు

అడ్డాకుల. ప్రజా స్వేచ్ఛ 12.ప్రతినిధి. వనపర్తి.

నేడు అనగా తేది మంగళవారం రోజు, తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం ( TYSS ) రాష్ట్ర అధ్యక్షులు పొన్నకల్ ఎలుసరి కృష్ణయ్య ఏకలవ్య, మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో గల తినగోస్ టిఎన్జిఓ ఎస్ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రంగాల్లో వెనకబడి జీవిస్తున్న, గిరిజనుల్లో ఉన్న ఎరుకల జాతి ప్రజలను ప్రభుత్వము గుర్తించి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు




మెంబర్, లలో మొదటి ప్రాధాన్యత ఇచ్చి రాజకీయ అవకాశాలు ఇవ్వాలని, స్వాతంత్ర్యము వచ్చి 75 సంవత్సరాలు దాటిన ఇప్పటికీ ఎరుకల సర్పంచ్ గా నోచుకోని ఎన్నో గ్రామాలు, కాలనీలు ఉన్నాయి. అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు, తప్ప గిరిజనుల్లో వెనుక బడి జీవిస్తున్న ఎరుకల జాతి ప్రజలను గుర్తించిన ప్రభుత్వం లేదు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం ఎరుకల జాతి ప్రజలను గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించి ఎరుకల సంక్షేమానికి, అభ్యున్నతి కి కృషి చేయ్యలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఏకలవ్య (ఎరుకల)కార్పొరేషన్ను ఏర్పాటు చేసి చైర్మన్ ను నియమించాలని డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమములో, తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎలుసరి తిరుమలేశ్, జిల్లా గౌరవ అధ్యక్షులు పుల్ రెడ్డి రాములు, సలహాదారులు నాగసర్తు చంద్రయ్య, గండీడ్ మండల అధ్యక్షుడు ముద్దని చెన్నయ్య భీమన్న, బాల్ రాజ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల యూవ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎన్నిక

### -కోరిగెల గోపి బీజేవైఎం మండల అధ్యక్షుడు

ఘనపూర్. ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 12 వనపర్తి ప్రతినిధి

బిజెపి మండల అధ్యక్షుని ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలలో పార్టీ బలోపేతం చేయుట కొరకై బీజేవైఎం మండల అధ్యక్షుడు కోరిగెల గోపి ముదిరాజ్ యువ మోర్చా కమిటీని ఫుల్ చేయటం జరిగింది నూతనంగా ఎన్నుకోబడిన మండల యువ మోర్చా ప్రధాన కార్యదర్శిగా సిరిసాలసాయినాథ్, ఉపాధ్యక్షులు పాత్లావత్ హేమంత్ రాథోడ్, సిద్దె వేణు,ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కౌన్సిల్ మెంబర్ దాసర్ల సత్యనారాయణ,ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి బెన్నూరు ఆశన్న,మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు చిట్యాల రామచంద్రయ్య, మండల నాయకుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు

# బిజినెస్

## ఇండియాలో టాప్ స్మాల్ బిజినెస్ ఐడియా ఇదే.




దేశంలో చాలా మంది యువత గ్రామాల్లోనే నివసిస్తుంటారు. సాధారణంగా పల్లెటూళ్లలో వ్యవసాయమే ప్రధానంగా జీవించే కుటుంబాలే ఎక్కువ. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద చదువులు చదివినా ఉద్యోగం లభించడం కష్టంగా మారింది. ఒకవేళ దొరికినా ఆఫీసు పని ఒత్తిడి, టార్గెట్ల మధ్య నలిగిపోతూ ఉండేవాళ్లు ఏదైనా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూసుకోవాలని ఆశిస్తుంటారు. స్వయం ఉపాధి కోసం ఎదురుచూసే వారికి ఊళ్లో కాస్త స్థలం ఉంటే చాలు. వారికి మైక్రో ఫార్మింగ్ బెస్ట్ ఆప్షన్ అవుతుంది. ఎందుకంటే, నేడు ఎక్కువ మంది కల్తీ, రసాయనాలతో పండించిన పంటలు అనారోగ్యం పాలవుతున్నారు. పక్కా ప్లానింగ్ వేసుకుని ఈ బిజినెస్ స్టార్ట్ చేస్తే లాభాలు రావడం ఖాయం.

-మైక్రో ఫార్మింగ్ ప్రారంభించేందుకు కావలసినవి..
-మీ తాహతుని బట్టి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ పెట్టుబడి పెట్టుకోవచ్చు.
-ఎన్ని ఎకరాల్లో చేయాలనేది మీ స్థాయిని బట్టి నిర్ణయించుకోండి.
-స్థలం లేదు అనుకునే వారు మేడపై కూడా చేయవచ్చు.
-ముల్లంగి, బ్రోకలీ, పొద్దుతిరుగుడు, బఠానీలు, కొత్తిమీర, క్యాబేజీ, ఉసిరికాయ పంటలు లాభసాటిగా ఉంటాయి.
-మార్కెట్ విషయంలో స్థానికంగా ముందుగానే మాట్లాడి ఉంచుకుంటే మేలు.
-పెద్ద స్థాయిలో మార్కెట్ చేస్తున్నా, పురుగుల మందులు వినియోగిస్తూ లైసెన్స్ తప్పక తీసుకోవాలి.

# స్వల్పంగా దిగొచ్చిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ**

గత కొద్ది రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు బుధవారం ఊరట కలిగించాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల తులం బంగారం ధర రూ.710 లు తగ్గి 86వేల 670 ల వద్ద ట్రేడ్ అవుతోంది.అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.700 లు తగ్గి 79వేల 400 లకు చేరింది. ఫిబ్రవరి ప్రారంభం నుంచి బంగారం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రారంభంలో 84 వేల 490 ఉన్న బంగారం ధర.. 12రోజుల్లో రూ. 2వేలకు పైగా పెరిగింది. ఇదే కంటిన్యూ అయితే మే నాటికి బంగారం ధరలు లక్షకు చేరుకునే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో మార్పులను బట్టి బంగారం ధరలు హెచ్చు తగ్గులకు లోను కావచ్చు. బంగారం ధరలు ప్రపంచ మార్కెట్లో బంగారం ధరలపై ఆధారపడి ఉంటాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి రేట్లు,కేంద్రం విధించే దిగుమతి సుంకాలు, ద్రవ్యోల్బణం, ప్రపంచ ధరలలో మార్పు, కేంద్ర బ్యాంకు బంగారు నిల్వ, వడ్డీ రేట్లలో హెచ్చుతగ్గులు, ఆభరణాల మార్కెట్లు వంటి అనేక అంతర్జాతీయ అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి.

# అమెజాన్‌లో ఆ ఈవీ స్కూటర్లపై బంపర్ ఆఫర్లు..
## బుక్ చేసుకుంటే నేరుగా మీ ఇంటికే..!



ఎంఓ కంపెనీకు సంబంధించిన మరో ఈవీ స్కూటర్ జాంటీ ఎల్ లీడ్ యాసిడ్ తక్కువ వేగంతో పాటు పోర్టబుల్ ఛార్జర్‌తో లభిస్తుంది. ఈ స్కూటర్‌లో యాంటీ-థెఫ్ట్ అలారం వల్ల ఈ స్కూటర్‌పై దొంగతనం భయాలు ఉండవు. ఈ స్కూటర్‌లో బ్లూటూత్ మ్యూజిక్ సిస్టమ్ ఆకట్టుకుంటుంది. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ నడపడం కూడా చాలా సులభం. ఈ స్కూటర్ మార్కెట్, ఆఫీసు లేదా కళాశాలకు వెళ్లేలా అంటే పట్టణ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకుని లాంచ్ చేశారు. ఈ స్కూటర్‌ను కేవలం రూ. 54,077కు సొంతం చేసుకోవచ్చు.ఏఎంఓ ఎలక్ట్రిక్ స్కూటర్ జాంటీ లిథియం బ్యాటరీతో ఆకట్టుకుంటుంది. గ్రే కలర్‌లో అందుబాటులో ఉండే ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌లో పోర్టబుల్ ఛార్జర్‌తో పాటు స్టైలిష్ ఎల్ఈడీ లైటర్లతో వస్తుంది. ఈ స్కూటర్‌పై ప్రత్యేక ఈఎంఐ ఆఫర్‌ను కంపెనీ అందిస్తుంది. ఈ స్కూటర్ బ్యాటరీ పూర్తిగా ఛార్జ్ కావడానికి 3 నుండి 4 గంటలు మాత్రమే పడుతుంది. ఈ స్కూటర్ ధర రూ.74691కు కొనుగోలు చేయవచ్చు.ఆంపియర్ కంపెనీకి చెందిన ఈవీ స్కూటర్ ఈఎక్స్ గెలాక్టిక్ అమెజాన్‌లో రూ.74,999కు అందుబాటులో ఉంది. గెలాక్సీ గ్రే కలర్‌లో అందుబాటులో ఉండే ఈ స్కూటర్‌లో మూడు డ్రైవింగ్ మోడ్‌లు ఉన్నాయి. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ 3 సంవత్సరాల వారంటీతో వస్తుంది. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌లో యూఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్‌తో పాటు స్టాండ్ సెన్సార్ కూడా ఆకట్టుకుంటుంది.ఈఓఎక్స్ కంపెనీకు సంబంధించిన ఈ-2 4జీ ఎలక్ట్రిక్ స్కూటర్ ఎరుపు రంగులో అందుబాటులో ఉంటుంది. ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కూడా ఈ స్కూటర్ నడపవచ్చు. బడ్జెట్ ఫ్రెండ్లీ డిజైన్‌తో కూడిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ డిజిటల్ డిస్‌ప్లే, యూఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్, ట్యూబ్‌లెస్ టైర్లు, వెనుక డిస్క్ బ్రేక్, ముందు డిస్క్ బ్రేక్‌లతో వస్తుంది. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌లో వాటర్‌ప్రూఫ్ బీఎల్‌డీసీ మోటార్‌తో వస్తుంది. ఈ స్కూటర్ రూ.47,998కు కొనుగోలు చేయవచ్చు.ఈఓఎక్స్ ఈ2 ఎలక్ట్రిక్ స్కూటర్ ప్రస్తుతం అమెజాన్‌లో రూ.51,498కు అందుబాటులో ఉంది. ఈ స్కూటర్‌ను ఒక్కసారి చార్జ్ చేస్తే 60 నుంచి 80 కిలో మీటర్ల మైలేజ్‌ను ఇస్తుంది.

# ఆఖరి మ్యాచ్‌లోనూ ఇంగ్లండ్ చిత్తు..

## -సిరీస్ క్లీన్ స్వీప్.. ఇక టార్గెట్ ఛాంపియన్స్ ట్రోఫీ




ఇంగ్లండ్ తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ భారత్ ఇంగ్లాండ్‌ను 3-0 తో సొంతం చేసుకుంది. బుధవారం అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లాండ్ టాస్ గెలిచి భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కానీ ఈ మ్యాచ్‌లో భారత్‌కు శుభారంభం లభించలేదు. గత మ్యాచ్ లో సెంచరీ చేసిన రోహిత్ శర్మ కేవలం ఒక పరుగు మాత్రమే చేసి ఔటయ్యాడు. అయితే ఆ తర్వాత, శుభ్‌మాన్ గిల్, విరాట్ కోహ్లీ నిలకడగా ఆడారు. శుభ్‌మాన్ గిల్ వన్డే క్రికెట్‌లో తన ఏడో సెంచరీని సాధించాడు. తద్వారా ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు తాను మంచి ఫామ్‌లో ఉన్నానని నిరూపించాడు. ఇక గత మ్యాచ్‌లో విఫలమైన విరాట్ కోహ్లీ కూడా అర్ధ సెంచరీ సాధించాడు. శ్రేయాస్ అయ్యర్ కూడా మిడిలార్డర్‌లో దూకుడుగా బ్యాటింగ్ చేసి హాఫ్ సెంచరీ కొట్టాడు. దీంతో నిర్ణీత 50 ఓవర్లలో 356 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ టార్గెట్ ను ఇంగ్లాండ్ అందుకోలేకపోయింది.భారత్ నిర్దేశించిన 357 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ బ్యాటర్లు దూకుడుగానే ఆడారు. ఫిలిప్ సాల్ట్, బెన్ డకెట్ తొలి వికెట్ కు 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత టామ్ బ్రాడెన్ కూడా ధాటిగా ఆడాడు. అయితే రెండు వికెట్లు పడిన తర్వాత ఇంగ్లండ్ పతనం మొదలైంది. మిడిలార్డర్ బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. జో రూట్, జోస్ బట్లర్ లు తక్కువ స్కోరుకే ఔటయ్యారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఇంగ్లండ్ 34.2 ఓవర్లలో 214 పరుగులకే కుప్పకూలింది. తద్వారా 142 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. అర్ష్ దీప్ సింగ్ , హర్షిత్ రాణా, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ తలా రెండు వికెట్లు తీశారు

# ఆస్ట్రేలియాపై శ్రీలంక ఘన విజయం!

## సమష్టిగా రాణించిన శ్రీలంక 49 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చిత్తు




ఆస్ట్రేలియాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన శ్రీలంక.. వన్డే సిరీస్‌లో మాత్రం శుభారంభం చేసింది. రెండు వన్డేల సిరీస్‌లో భాగంగా కొలంబో వేదికగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన శ్రీలంక 49 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46 ఓవర్లలో 214 పరుగులకు కుప్పకూలింది. చరిత్ అసలంక(126 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్స్‌లతో 127) సెంచరీతో చెలరేగగా..దునిత్ వెల్లాలేగే(30) రాణించాడు. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ మూడు వికెట్లు తీయగా.. స్పెన్సర్ జాన్సన్, ఆరోన్ హార్డీ, నాథన్ ఎల్లిస్ రెండేసి వికెట్లు పడగొట్టారు. మాథ్యూ షార్ట్ ఓ వికెట్ తీసాడు. అనంతరం ఆస్ట్రేలియా 33.5 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. మార్నస్ లబుషేన్(41), ఆరోన్ హార్డీ(32) టాప్ స్కోరర్లుగా నిలిచారు. శ్రీలంక బౌలర్లలో మహీష్ తీక్షణ(4/40) నాలుగు వికెట్లు తీయగా.. అసిత ఫెర్నాండో రెండు వికెట్లు, వానిందు హసరంగా, చరిత్ అసలంక తలో వికెట్ తీసారు.


# స్పోర్ట్స్

## సెంచరీతో చెలరేగిన గిల్

### గిల్ ఆల్ టైమ్ రికార్డ్




టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ శుభ్?మన్ గిల్ ఇంగ్లాండ్?తో మూడో వన్డేలో శతకంతో కదం తొక్కాడు. తొలి ఓవర్ నుంచే అద్భుతమైన ఆటతో అలరించిన గిల్ 102 బంతుల్లో 112 పరుగులు చేశాడు. ఇందులో 14 ఫోర్లు, 3 సిక్స్?లు ఉన్నాయి. కాగా, గిల్?కు వన్డేల్లో ఇది 7వ సెంచరీ. ఈ క్రమంలో గిల్ పలు అరుదైన ఘనతలు తన ఖాతాలో వేసుకున్నాడు. గిల్? కెరీర్?లో ఇది తనకు 50వ వన్డే మ్యాచ్?. భారత్ తరఫున 50వ వన్డేలో సెంచరీ సాధించిన తొలి బ్యాటర్?గా రికార్డు సృష్టించాడు.గిల్ కన్నా ముందు ఏ భారత ఆటగాడు కూడా 50వ మ్యాచ్?లో శతకం బాదలేదు. 50 మ్యాచ్?ల్లోనే గిల్ 2500 పరుగుల మార్క్? దాటాడు. ఈ క్రమంలో వన్డేల్లో అత్యధిక వేగంగా ఈ మైలురాయి అందుకున్న ఆటగాడిగా నిలిచాడు. ఇదివరకు ఈ రికార్డ్ సౌతాఫ్రికా బ్యాటర్ హషీమ్ ఆమ్లా (51 మ్యాచ్?ల్లో) పేరిట ఉంది. తాజా మ్యాచ్?తో గిల్ ఆ రికార్డ్? బద్దలు కొట్టాడు. గిల్ వన్డేల్లో ఇప్పటివరకు 2587 పరుగులు చేశాడుఅహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. అయితే ఈ స్టేడియంలో గిల్ అన్ని ఫార్మాట్ (టీ20, వన్డే, టెస్టు, ఐపీఎల్)ల్లో సెంచరీ నమోదు చేశాడు. ఈ క్రమంలో ఒకే వేదికపై అన్ని ఫార్మాట్లలో సెంచరీ బాదిన భారత తొలి బ్యాటర్?గా రికార్డ్ సృష్టించాడు. అంతర్జాతీయ, ఐపీఎల్? (3) కలిపి గిల్ నరేంద్ర మోదీ స్టేడియంలో 6 శతకాలు నమోదు చేశాడు. ఇక ప్రపంచవ్యాప్తంగా ఒకే స్టేడియంలో అన్ని ఫార్మాట్లలో సెంచరీ సాధించిన ఐదో ఆటగాడిగా నిలిచాడు. అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు బీసీసీఐ ముందడుగు వేసింది. ఈ క్రమంలో మూడో వన్డేలో ఇంగ్లాండ్- టీమ్ఇండియా ప్లేయర్స్ గ్రీన్ ఆర్మ్ బ్యాండ్స్ ధరించి మైదానంలోకి దిగారు. బీసీసీఐ తలపెట్టిన 'డొనేట్ ఆర్గాన్స్, సేవ్ లైవ్స్'కు మద్దతుగా రెండు జట్లూ గ్రీన్ ఆర్మ్ బ్యాండ్?లు ధరించాయి.







# ఛావా ప్రీరిలీజ్ వేడుకల్లో రష్మిక

## అల్లు అర్జున్‌తో నా ఎనర్జీ సరిపోతుందని వ్యాఖ్య

ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతోంది రష్మిక. తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ సినిమాలను చేస్తూ తీరిక లేకుండా గడుపుతోంది. విక్కీ కౌశల్ కీలక పాత్రలో లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో రూపొందిన హిస్టారికల్ ఎపిక్ యాక్షన్ ఫిల్మ్ 'ఛావా' రష్మిక కథానాయిక. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆమెతో కలిసి నటించిన హీరోల గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'గొప్ప కథల్లో భాగమవడం నాకెంతో ఇష్టం. ఆ సినిమాను ప్రేక్షకులు చూసి, దాని గురించి మాట్లాడుతుంటే, మరింత సంతోషంగా ఉంటుంది. అలాంటి కథల్లోనే నటించాలనుకుంటా. నేను తెరపై కనిపించినంతసేపు ప్రేక్షకుల దృష్టి నాపై ఉండేలా చేయగలను. అదే సమయంలో ఆ సన్నివేశంలో ఎవరు నటిస్తున్నారన్న విషయాన్ని పట్టించుకోను' అని చెప్పుకొచ్చింది. తన సహ నటుల గురించి మాట్లాడుతూ వారిపై ప్రశంసలు కురిపించింది. విక్కీ కౌశల్, అల్లు అర్జున్, రణ్‌బీర్ కపూర్‌లతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా అనిపించిందని తెలిపింది. 'ఇటీవల నేను చేసిన సినిమాల్లోని కో-స్టార్స్ అందరూ ఎంతో మంచి వ్యక్తులు. స్నేహభావంతో, ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా వ్యవహరిస్తారు. ముఖ్యంగా అల్లు అర్జున్ సర్‌తో నా ఎనర్జీ పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతుంది. ఆయనతో నటించడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఇక రణ్‌బీర్‌కు నాకూ నాన్సెన్స్ నచ్చదు. కేవలం పాత్రల గురించి తప్ప ఇతర విషయాలేవీ మాట్లాడుకోం. అంతా ప్రొఫెషనల్‌గా ఉంటాం. చివరిగా విక్కీ కౌశల్ అద్భుతమైన వ్యక్తి. ఇలాంటి వారు చాలా అరుదుగా ఉంటారు. వాళ్లతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది' అంటూ తెలిపింది రష్మిక. మరోవైపు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో 'ది గర్ల్‌ఫ్రెండ్', సల్మాన్‌ఖాన్-మురుగదాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'సికిందర్', అలాగే ధనుష్-శేఖర్ కమ్ముల ఫిల్మ్ 'కుబేర' చిత్రాల్లో రష్మిక నటిస్తోంది.

# రామ్‌గోపాల్ వర్మ శారీ టీజర్ విడుదల

టాలీవుడ్ విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ లేటెస్ట్ మూవీ 'శారీ'. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో,ఆర్జీవి-ఆర్వి ప్రొడక్షన్స్ పై ప్రముఖ వ్యాపారవేత్త రవి శంకర్ వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ మూవీని పలు నిజజీవిత సంఘటనల ఆధారాలతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది.కాగా ఈ చిత్రం పాన్ ఇండియా మూవీగా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఫిబ్రవరి 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో భాగంగా తాజాగా ఈ రోజు 'శారీ' సినిమాకు సంబంధించిన ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్ ఉహించని విధంగా చాలా త్రిల్లింగ్ గా ఉంది. అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి బాగా చూపించారు.కొంత భయంగా కూడా ఉంది. ఇక దర్శక, నిర్మాత రామ్ గోపాల్ వర్మ 'సోషల్ మీడియాలో ఎవరెవరు ముక్కు మొహం తెలియని వాళ్ళతో పరిచయం పెంచుకుని, వాళ్ళ బ్యాక్ గ్రౌండ్ గాని, ఫోర్ గ్రౌండ్ గాని, ఏమి తెలియకుండా నమ్మేయడంతో, ఎదురయ్యే ప్రమాదాలు, భయంకర సంఘటనలు, మనం చాలా చాలా విన్నాం! చూసాం! ఇలాంటి నిజ జీవిత ఘటన ఆధారంగా తీసిన సినిమా ఈ 'శారీ' మూవీ' చెప్పారు. ఇక నిర్మాత రవిశంకర్ వర్మ మాట్లాడుతూ 'మా 'శారీ' చిత్రంలోని టీజర్, 'ఐ వాంట్ లవ్' అండ్ 'ఎగిరే గువ్వలాగా?' అనే రెండు లిరికల్ సాంగ్స్ విడుదల చేసాము. వాటికి సోషల్ మీడియాలో విశేష స్పందన లభించింది. ఈ రోజు ట్రైలర్ మాంగో మీడియా ద్వార తెలుగు, హిందీ, తమిళ, మరియు మళయాళ భాషల్లో విడుదల చేసాము.సినిమా ఈ నెల 28న అన్ని భాషల్లో థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నాం తప్పక చూడండి' అంటూ తెలిపారు.

# చీరకట్టులో చందమామలా మెరిసిపోతున్న హెబ్బా పటేల్

అలా ఎలా అనే సినిమాతో హీరోయిన్ గా పరిచయమైన హెబ్బా పటేల్ తన నటనతో ఆకట్టుకుంది. ఆతర్వాత వచ్చిన కుమారి 21 ఎఫ్ సినిమా ఈ అమ్మడి క్రేజ్ ను పెంచేసింది. కుమారి 21 ఎఫ్ సినిమా తర్వాత చాలా మంది హెబ్బా పటేల్ కోసం గూగుల్ ను గాలించారు.ఈ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది ఈ చిన్నది. కానీ అంతగా సక్సెస్ కాలేకపోయింది. కేవలం గ్లామరే కాదు డీ గ్లామర్ రోల్ కూడా చేస్తానని ఓదెల మూవీతో నిరూపించింది. ఆ తర్వాత సెకండ్ హీరోయిన్ గా చేసింది. అయినా కూడా అంతగా గుర్తింపు తెచ్చుకోలేకపోయింది.ఇక స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. అందంలో మంచి మార్కులు కొట్టేసిన ఈ అమ్మడు మంచి సినిమా పడితే తన టాలెంట్ ను నిరూపించుకోవాలని ఎదురుచూస్తుంది. కానీ ఆశించిన స్థాయిలో అవకాశాలు అందుకోలేకపోతుంది. ఇక సోషల్ మీడియాలో హెబ్బా పటేల్ చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఈ మధ్య అందాల ఆరబోతతో అదరగొడుతోంది. క్రేజీ ఫోటోలను షేర్ చేస్తూ వావ్ అనిపిస్తుంది. నిత్యం హెబ్బా పటేల్ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతుంటాయి.ఇక హెబ్బా పటేల్ షేర్ చేసే ఫోటోలకు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉంది. ఓ వైపు చీరకట్టులో కవ్విస్తూనే మరో వైపు గ్లామరస్ ఫోటోలతో ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ చీర కట్టిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి






# నన్ను రాజకీయాల్లోకి లాగకండి

## లైలా హీరో విశ్వక్ సేన్ పోస్ట్

'లైలా' ప్రీరిలీజ్ వేడుకలో నటుడు పృథ్వీ చేసిన రాజకీయ వ్యాఖ్యలు నెట్టింట చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దీనిపై విష్వక్ సేన్, చిత్ర నిర్మాత సాహు గారపాటి ఇప్పటికే క్షమాపణలు చెప్పారు. అయినా 'లైలా'కు వ్యతిరేకంగా ఎక్స్ వేదికగా పోస్టులు మాత్రం ఆగడం లేదు. తాజాగా దీనిపై విష్వక్‌సేన్ మరోసారి స్పందించారు. తనను, తన సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దంటూ పోస్ట్ పెట్టారు. ఈ సినిమా పాట పోస్టర్‌లను విష్వక్ సేన్ షేర్ చేశారు. 'నా సినిమాకు సంబంధించిన ప్రతి పోస్టర్.. నా సినిమాకు సంబంధించింది మాత్రమే. సినిమాల పోస్టర్స్, పోస్టులను షేర్ చేసే ప్రతిసారీ రెండుసార్లు ఆలోచించలేను. ఈ ఫొటోలో ఉంది సోనూ మోడల్.. ఫిబ్రవరి 14న మీ ముందుకు వస్తున్నాడు' అని అన్నారు. ఇక ఎక్స్‌లో ట్రెండ్ అవుతోన్న బాయ్‌కాట్ లైలా హ్యాష్‌ట్యాగ్ గురించి మాట్లాడుతూ.. 'నేను ప్రతిసారీ తగ్గను. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో జరిగిన దానికి నిన్న మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పాను. అతిగా ఆలోచించొద్దు. ప్రశాంతంగా ఉండండి. మళ్లీ చెబుతున్నాను.. నేను నటుడిని మాత్రమే. నన్ను, నా సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దు' అని విష్వక్‌సేన్ చెప్పారు. విష్వక్‌సేన్ హీరోగా దర్శకుడు రామ్‌నారాయణ్ తెరకెక్కించిన చిత్రమే 'లైలా' ఆకాంక్ష శర్మ హీరోయిన్. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ఇటీవల నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో.. తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ విశేషాలు చెబుతూ 150 మేకల్లో చివరకు 11 మిగిలాయని నటుడు పృథ్వీరాజ్ చెప్పడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ సినిమాని బాయ్‌కాట్ చేయాలంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ మొదలైంది. ఈ హ్యాష్‌ట్యాగ్‌తో ఇప్పటివరకూ లక్షా 50వేలకు పైగా పోస్టులు షేర్ అయ్యాయి.

# కింగ్ డమ్ టీజర్ రిలీజైన నిమిషాల్లోనే రష్మిక పోస్ట్



విజయ్ దేవరకొండకు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. అతనికి పాన్ ఇండియా స్థాయిలో మంచి క్రేజ్ ఉంది. అయితే గత కొన్నేళు గా తన స్థాయికి తగ్గ సినిమాను అందించలేకపోతున్నాడు రౌడీ బాయ్. భారీ అంచనాలతో విడుదలైన 'లైగర్' సినిమా బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది. ఆ తర్వాత వచ్చిన 'ఖుషి', 'ది ఫ్యామిలీ స్టార్' చిత్రాలు కూడా యావరేజ్ రిజల్ట్ తోనే సరిపెట్టుకున్నాయి. అయితే ఎలాగైనా బ్లాక్ బస్టర్ హిట్ కొట్టాలనే కసితో కింగ్ డమ్ అనే పవర్ ఫుల్ టైటిల్ తో మన ముందుకు వస్తున్నాడు విజయ్. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా టీజర్ ను కాసేపటి క్రితమే చిత్రబృందం విడుదల చేసింది. ప్రస్తుతం కింగడమ్ టీజర్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అయితే టీజర్ రిలీజైన నిమిషాల వ్యవధిలోనే హీరోయిన్ రష్మిక మందన్నా స్పందించింది. కింగ్ డమ్ సినిమా టీజర్ తనకెంతో నచ్చిందంటూ ఇన్‌స్టా స్టోరీస్ వేదికగా పోస్ట్ పెట్టింది. ఇతను ఒకే తరహా కథలతో ప్రతిసారి డిఫరెంట్ సబ్జెక్ట్ తో వస్తాడు. ప్రతిసారీ ఏదో ఒక అద్భుతంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుంటాడు. విజయ్ నిన్ను చూసి నేను చాలా గర్వ పడుతున్నా' అంటూ విషెస్ చెప్పింది రష్మిక. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరలవుతోంది. దీనిని చూసిన సినీ అభిమానులు, నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492